
డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD



www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
30-06-2024
సంపుటి : 01 | సంచిక : 57 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



V3 NEWS




# విశ్వ విజేత టీమిండియా

## నెరవేరిన 17 ఏళ్ల కల

టీ20 ప్రపంచ కప్‌లో ఘన విజయం

సౌతాఫ్రికాపై 7 పరుగుల తేడాతో విక్టరీ

సగర్వంగా ట్రోఫీ ముద్దాడిన టీమిండియా

ఆఖరి ఓవర్లలో రెండు వికెట్లు తీసిన పాండ్యా

**విశ్వంభర, హైదరాబాద్:**

బార్బడోస్ వేదికగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుని ప్రత్యర్థి జట్టును బౌలింగ్‌కు ఆహ్వానించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 76) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. అక్షర్ పటేల్ (31 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 47) అద్భుత ప్రదర్శన చేశాడు. ఒకానొక సమయంలో టీమిండియా ఐదో ఓవర్లో కేవలం 34 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శన చేసిన రోహిత్ శర్మను సౌతాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ రెండో ఓవర్‌లోనే పెవిలియన్‌కు పంపాడు. స్వీప్ షాట్ ఆడేందుకు ప్రయత్నిస్తుండగా స్క్వేర్ లెగ్ వద్ద క్యాచ్ పట్టాడు. ఆ తర్వాత వచ్చిన రిషబ్ పంత్ కూడా నిరాశ పరిచాడు. సూర్యకుమార్ యాదవ్‌ను ఔట్ చేయడంతో టీమిండియాకు మిగతా11లో...

“

టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత రెండోసారి వరల్డ్ కప్ ట్రోఫీ రోహిత్ సేన దక్కించుకుంది. దశాబ్ద కాలంగా నెలకొన్న ట్రోఫీ కరువుకు తెరదించుతూ సగర్వంగా ట్రోఫీని ముద్దాడింది. సౌతాఫ్రికాతో శనివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో టీమిండియా 7 పరుగల తేడాతో గెలుపొందింది. చివరి ఓవర్ చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో 140 కోట్ల మంది భారతీయులు కలలుగన్న దాన్ని టీమిండియా సాధించింది. సంచలన ప్రదర్శనతో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడి.. బార్బడోస్ గడ్డపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసింది. ఒక దశలో ఓడిపోయేలా కనిపించిన టీమిండియా.. బౌలర్ల సంచలన ప్రదర్శనతో అద్భుత విజయాన్ని అందుకుంది. టీ20 ప్రపంచకప్ తొలి ఎడిషన్ 2007లో టీమిండియా టైటిల్ సాధించింది. ఎంఎస్ ధోనీ సారథ్యంలో ట్రోఫీ కైవసం చేసుకుంది. ఆ తర్వాత మరో టీ20 టైటిల్ దక్కలేదు. ఇప్పుడు 17 ఏళ్ల తర్వాత రోహిత్ శర్మ సారథ్యంలో టీ20 వరల్డ్ కప్ టైటిల్ అందుకుంది. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంబరాలతో మునిగిపోయారు.



## మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత

### ఊట్నూరులో అర్ధరాత్రి తీవ్ర అస్వస్థత

- హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి
- 1999లో టీడీపీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం
- 2009లో ఆదిలాబాద్ ఎంపీగా గెలుపు
- రమేష్ రాథోడ్‌కి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

**విశ్వంభర, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నేత రమేశ్ రాథోడ్ (59) శనివారం కన్నుమూశారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్ లో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్తున్నారు. అయితే హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే రమేశ్ రాథోడ్ మృతి చెందారు. శుక్రవారం అర్ధరాత్రి రమేష్ రాథోడ్ ఉట్నూరులోని ఆయన నివాసంలో అస్వస్థతకి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కి తీసుకువస్తుండగా.. మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద ఆఖరి శ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఉట్నూరుకి తరలించారు. ఆయన మృతి పట్ల పలువురు నేతలు సంతాపం మిగతా2లో...

## జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు విలీనం

- ఆమోదం తెలిసిన కేంద్ర ప్రభుత్వం
- కంటోన్మెంట్ బోర్డు ఆస్తులు, అప్పులు బదిలీ
- ఫలించిన సీఎం రేవంత్ రెడ్డి కృషి
- నెరవేరిన కంటోన్మెంట్ వాసుల చిరకాల కోరిక



2

## డీఎస్ ఇక లేరు

### గుండెపోటుతో మరణించిన ధర్మపురి శ్రీనివాస్

- ఉమ్మడి ఏపీలో పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా సేవలు
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు సీఎం ఆదేశం
- డీఎస్ పార్థివదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాకప్పిన నాయకులు
- సంతాపం తెలిపిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ
- కేసీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు డీఎస్‌కు నివాళి



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ,మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీ శ్రీనివాస్ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. డీఎస్ గా పేరొందిన డి. శ్రీనివాస్ ఉమ్మడి ఏపీలో మంత్రిగా,ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు.ప్రస్తుతం ఆయన రెండో కుమారుడు ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ బీజేపీ ఎంపీగా ఉన్నారు.పెద్దకుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్ గా పనిచేశారు.

**అంచెలంచెలుగా ఎదిగి...**

డి. శ్రీనివాస్ చదువు పూర్తయ్యాక కాంగ్రెస్ పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మిగతా2లో...




# హైదరాబాద్‌కు దీటుగా వరంగల్!

### హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తాం

- వరంగల్ టెక్స్ టైల్ పార్కు నిర్వాసితులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం
- ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్ టైల్ పార్కుకు కనెక్టివిటీ మార్గం
- డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు
- వరంగల్ వాసులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక హామీలు

**విశ్వంభర, వరంగల్ :**

వరంగల్‌లో హైదరాబాద్‌తో సమానంగా అభివృద్ధి జరగాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన వరంగల్ పర్యటనలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు, హనుమకొండ కలెక్టరేట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూ సేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని అధికారులను కోరారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని సూచించిన సీఎం... ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్ టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం మిగతా2లో...


మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి


## ఇద్దరు ఇద్దరే..

- ఉద్దండ నేతలను కోల్పోయిన తెలంగాణ
- ఒకేరోజు రెండు జాతీయ పార్టీల్లో తీవ్ర విషాదం
- పీసీసీ చీఫ్, మాజీ మంత్రి డీఎస్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ మృతి
- సీఎం రేవంత్ సహా, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి



2

## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర | రిటైల్ |
| ₹ 112 | ₹ 134 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 194 | ₹ 221 |

## మహిళా సంఘాలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

- మహిళలకు ఈ సేవ, మీ సేవ కేంద్రాల అప్పగింత
- గ్రామీణ ప్రజలకు ఆన్ లైన్ సేవలు అందుబాటులోకి..
- మీ సేవ కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు కేటాయింపు

2

## సాయి మాట, పాట ప్రవహించే నది

- సాయి లేకుండా కేసీఆర్ సభ ఉండేది కాదు..
- సాయిచంద్ నాకు తమ్ముడితో సమానం
- జీవించి ఉంటే చట్టసభలో అడుగు పెట్టేవాడు
- సాయిచంద్ తొలి వర్ధంతిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

2

## నీట్‌ను జాతీయ స్థాయిలో రద్దు చేయాలి

- ఆసక్తి ఉన్న రాష్ట్రాలు నిర్వహించుకునే చాన్స్ కల్పించాలి
- మోడీకి, ఎనిమిది రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ

9

# జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు విలీనం

విశ్వంభర, సికింద్రాబాద్ : కంటోన్మెంట్ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా రక్షణ శాఖ మంత్రికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. మార్చి 5వ తేదీన రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దు చేసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇటీవలే కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈనెల 25 కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లోనూ విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం కేంద్ర రక్షణ శాఖ అందుకు సంబంధించిన విధి విధానాలపై లేఖ రాశారు. దీని ప్రకారం కంటోన్మెంట్ లోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. అక్కడ ఇప్పటికే లీజులు ఇచ్చినవి కూడా మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్ లోని నివాస ప్రాంతాలకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరిస్తుంది. తన పరిధిలో ఉన్న వాటిపై పన్నులను విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు, సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, తదుపరి కార్యాచరణ చేపట్టాలని సూచించింది.

# మహిళా సంఘాలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

**విశ్వంభర, వరంగల్ :** మహిళా సంఘాలకు రేవంత్ సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న మీ సేవ కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ సేవ, మీ సేవ పేరుతో కేంద్రాలను మంజూరు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మీ సేవ ద్వారా ఆన్లైన్ సేవలు అందడంతో పాటు వాటి నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు కూడా ఆర్థికంగా లాభం పొందుతాయని ప్రభుత్వం యోచిస్తోంది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 4525 మీసేవ కేంద్రాలు ఉండగా… వీటిలో మూడు వేల వరకు పట్టణ, నగర ప్రాంతాల్లోనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నాయి. పన్నెండు వేలకు పైగా పంచాయతీలు ఉంటే.. కేవలం వెయ్యి గ్రామాల్లోనే మీ సేవ కేంద్రాలున్నాయి. ఈ సేవ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల చిన్న పనులకు కూడా ప్రజలు ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లాల్సి వస్తోంది.ఈ పరిస్థితిని గమనించిన తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు ఈ సేవ, మీ సేవ కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించింది. గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు పెట్టుకునేందుకు స్వయం సహాయ సంఘాలకు రెండున్నర లక్షల వరకూ రుణం కూడా అందించనుంది. ఈ రుణాలతో ఈ సేవ కేంద్రాలకు అవసరమైన సాంకేతిక పరికరాలను కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేస్తారు కాబట్టి.. ఆ కేంద్రాలకు అవసరమైన స్థలం కూడా ప్రభుత్వ భవనాలలోనే లభ్యతను బట్టి కేటాయించే ఛాన్స్ ఉంది. ఇంటర్ పాసైన వారిని ఆపరేటర్లుగా పని చేసేందుకు శిక్షణ ఇప్పిస్తారు. మీ సేవ అధికారుల పర్యవేక్షణలో ఇవి పని చేస్తాయి. మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. పంద్రాగస్టు నాటికి గ్రామాల్లో మీసేవ కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం ఇటీవల మహిళాశక్తి క్యాంటీన్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

# సాయి మాట, పాట ప్రవహించే నది

- **సాయి లేకుండా కేసీఆర్ సభ ఉండేది కాదు..**
- **సాయిచంద్ నాకు తమ్ముడితో సమానం**
- **జీవించి ఉంటే చట్టసభలో అడుగు పెట్టేవాడు**
- **సాయిచంద్ తొలి వర్ధంతిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ గాయకుడు వేద సాయిచంద్ తొలి వర్ధంతి కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు .జోహార్ సాయిచంద్.. సాయిచంద్ మనల్ని వీడి అప్పుడే ఏడాది అయిందంటే నమ్మలేకపోతున్నాం అనీ,సాయిచంద్ మరణాన్ని మనమెవరం ఊహించలేదు.. సాయిచంద్ నాకు తమ్ముడిగా, కుటుంబసభ్యుడిగా నాతో అన్ని కష్టసుఖాలు పంచుకునేవాడు అని అన్నారు. ఉద్యమంలో సాయిచంద్‌తో కలసి తెలంగాణలో వేల కిలోమీటర్లు ప్రయాణించాం.. అతనితో అంత ఆత్మీయ అనుబంధం ఉంది .సాయిచంద్ భౌతికంగా మన మధ్యలేకపోయినా తెలంగాణ ప్రజలందరి హృదయాల్లో ఉన్నాడు. సాయి మాట, పాట ప్రవహించే నదిలా ఉండేది.. ఆ గళం గలగలపారే నది, పాటలు, మాటలు అద్భుతంగా వచ్చేవి అని తెలిపారు. సాయి లేకుండా కేసీఆర్ సభ ఉండేది కాదు.. ఆయన కేసీఆర్‌కు చాలా దగ్గర ఉండేవాడు.ఉద్యమంలో సాయిచంద్, బాలకిషన్ కేసీఆర్‌కు అడుగులో అడుగై పాటలు రాశారు అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సాయిచంద్ చేసిన దోహదం మాటల్లో చెప్పలేనిది, వెలకట్టలేనిది. రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా అని పాడుతుంటే లక్షల మంది కన్నీళ్లు పెట్టునేవాళ్లు.. సాయిచంద్ జీవించి ఉంటే తప్పకుండా చట్టసభలో అడుపెట్టేవాడు. ఒక గొప్ప నాయకుడిని కళాకారుడిని బీఆర్ఎస్, తెలంగాణ సమాజం కోల్పోయింది. మొన్నటి ఎన్నికల సభల్లో సాయిచంద్ లేని లోటు స్పష్టంగా కనిపించింది. తెలంగాణ రావాలని, ప్రజల కష్టాలు తీరాని సాయిచంద్ ఎంతో కష్టపడ్డాడు. సాయిచంద్ భార్యాపిల్లలకు, తల్లిదండ్రులకు మేం అండగా ఉంటాం అని హరీష్ రావు అన్నారు.



# డీఎస్ ఇక లేరు

**(మొదటి పేజీ తరువాయి)**
విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన డి. శ్రీనివాస్ 1948 సెప్టెంబరు 27వతేదీన జన్మించారు.హైదరాబాద్ నగరంలోని నిజాం కళాశాలలో డిగ్రీ చదివిన తర్వాత 1989వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి ఆయన తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన డీఎస్ 2009లో సీఎం రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర ఉన్నతవిద్య,ఇంటరు విద్యా శాఖల మంత్రిగా పనిచేశారు.1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పీఆర్ మంత్రిగా, 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో అప్పటి టీఆర్ఎస్‌తో పొత్తుకుదుర్చుకోవడంలో డీఎస్ కీలకపాత్ర వహించారు.

**పీసీసీ అధ్యక్షుడిగా...**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా డి శ్రీనివాస్ పనిచేశారు. 2016 జూన్ 22 నుంచి 2022 జులై 4వతేదీ వరకు ఈయన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. 2014 జూన్ 3 నుంచి 2015 జులై 2వతేదీ వరకు తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ లో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేశారు.. బీఆర్ఎస్ పార్టీలో చేరాక డీఎస్ రాష్ట్ర ప్రభుత్వ అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు.తెలంగాణ ఆవిర్భావం తర్వాత మండలి విపక్ష నేతగా కూడా పనిచేశారు.2004,2009 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో రాజశేఖర్ రెడ్డితో కలిసి డీఎస్ కీలక పాత్ర పోషించారు. డీఎస్ 2009, 2010 ఉప ఎన్నిక, 2012, 2014లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.



**బీఆర్ఎస్ చేరిన డీఎస్**
కాంగ్రెస్ పార్టీలో ఉండగా తెలంగాణ కోసం ఉద్యమించారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత 2015వ సంవత్సరం జులై 2వతేదీన డీఎస్ 2015వ సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా డీఎష్ ఇంటికి వెళ్లి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన డీఎస్‌కు కేసీఆర్ రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. తెలంగాణలో మళ్లీ 2023 మార్చి 26వతేదీన బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చివరి దశలో సొంత గూటికి వచ్చిన డీఎస్ కాంగ్రెస్ సీనియర్ నేత డీ.శ్రీనివాస్ 2023 మార్చి 26వతేదీనతిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్ తో కలిసి వీల్‌చైర్‌లో గాంధీభవన్ కు వచ్చిన డీఎస్ కాంగ్రెస్ తీర్థం స్వీకరించారు. కాంగ్రెస్ లో తిరిగి చేరడం ఎంతో ఆనందంగా ఉందని, సొంత ఇంటికి వచ్చినట్లు ఉందని డీఎస్ గతంలో వ్యాఖ్యానించారు. తన పెద్దకొడుకు ధర్మపురి సంజయ్ తో కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు సీఎం ఆదేశం**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కు (డీఎస్) అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. డీఎస్ కు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పాలని నిర్ణయించిన టీపీసీసీ ఆ మేరకు చర్యలు తీసుకున్నారు.

**డి.శ్రీనివాస్ ఇంటికి బీఆర్ఎస్ నేతలు**
మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి శ్రీనివాస్ ఇంటికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పలువురు పార్టీ సీనియర్ నాయకులు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో అజాత శత్రువు డి శ్రీనివాస్ అన్నారు. ఆయన చనిపోవటం బాధాకరమైన విషయం…డి శ్రీనివాస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని వెల్లడించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

**ఎంపీ అర్వింద్ ట్వీట్**
తండ్రి మృతిపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ ట్వీట్ చేశారు. "అన్నా.. అంటే నేనున్నా అని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు. ఐ విల్ మిస్ యూ డాడీ!.. నా తండ్రి, నా గురువు అన్నీ మా నాన్నే. ఎదురొడ్డు, పోరాడు, భయపడకు అని నేర్పింది మా నాన్నే. ప్రజలను ప్రేమించు, ప్రజల కొరకే జీవించు అని చెప్పింది మా నాన్నే. నాన్నా..! నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు. ఎప్పటికీ నాలోనే ఉంటావు' అంటూ ఎక్స్‌లో ఎంపీ అర్వింద్ పోస్ట్ చేశారు.ప్రస్తుతం డీఎస్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లోనే ఉంచారు.శనివారం సాయంత్రం నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించనున్నారు.

**డీఎస్ మరణం చాలా బాధకరం : ప్రధాని మోడీ (బాక్స్)**
ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన డీఎస్ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీఎస్ మరణం పట్ల ప్రధాని మోడీ సంతాపం తెలిపారు. మాజీ ఎంపీ డీఎస్ మరణం నన్ను ఎంతో బాధించిందని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవకు, పేద ప్రజల సాధికారతకు సుదీర్ఘకాలం పాటు ఆయన చేసిన కృషి మరిచిపోలేనిదని కొనియాడారు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు శ్రేయోభిలాషులకు సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. కాగా, డీఎస్ చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ బీజేపీ ఎంపీగా కొనసాగుతోన్న విషయం తెలిసిందే.

# ఇద్దరు ఇద్దరే..

**విశ్వంభర, హైదరాబాద్:**
తెలంగాణాలోని రెండు పార్టీల్లో ఒకేరోజు విషాధం చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ మరణించగా, ఉదయం బీజేపీ సీనియర్ నేత రమేష్ రాథోడ్ మరణించారు. డీఎస్ గా పాపులరైన ధర్మపురి శ్రీనివాస్ చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇక రమేష్ విషయం చూస్తే ఈయనకు పెద్దగా అనారోగ్య సమస్యలు ఉన్నట్లు లేదు. కాకపోతే శుక్రవారం అర్ధరాత్రి అనారోగ్యం పాలయ్యారు. దాంతో ముందు లోకల్ ఆసుపత్రిలో చేర్పించి తర్వాత హైదరాబాద్ తరలిస్తుండగా మధ్యలోనే చనిపోయారు.

**కేసీఆర్‌తో విభేదాలు**
బీఆర్ఎస్ కు దూరమైన డీఎస్ ఈమధ్యనే కాంగ్రెస్ లో చేరారు. గాంధీభవన్ కు చక్రాల కుర్చీలోనే కొడుకు ధర్మపురి సంజయ్ తో కలిసొచ్చారు. ప్రజాప్రతినిధిగా చాలా సంవత్సరాలున్నారు. ఎంఎల్ఏగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, ఎంఎల్సీ, ఎంపీగా తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అనుభవించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తో కలిసి 2004, 2009లో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో విన్నింగ్ జంటగా బాగా పాపులరయ్యారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన డీఎస్ 1989,99, 2004 మూడుసార్లు ఎంఎల్ఏగా పనిచేశారు. ఉన్నతవిద్యాశాఖతో పాటు చాలా శాఖలకు మంత్రిగా పనిచేశారు. తెలంగాణా ఏర్పాటైన తర్వాత కాంగ్రెస్ కు రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరారు. కొంతకాలం ప్రభుత్వ సలహాదారుగా పనిచేసి రాజీనామా చేశారు. తర్వాత రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. ఆ తర్వాత కేసీయార్ తో విభేదాల కారణంగా రాజీనామా చేసి చివరకు కాంగ్రెస్ లోనే చేరారు.

**రమేష్ రాథోడ్.. ఎమ్మెల్యేగా.. ఎంపీగా..**
ఇక రమేష్ రాథోడ్ విషయం చూస్తే ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో 1999లో టీడీపీ తరపున ఎంఎల్ఏగా పనిచేశారు. ఆ తర్వాత నార్నూర్ జడ్పీటీసీగా గెలిచి 200609 మధ్య జిల్లా పరిషత్ ఛైర్మన్ గా పనిచేశారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో ఆదిలాబాద్ (ఎస్టీ) ఎంపీగా టీడీపీ తరపున గెలిచారు. చాలా కాలం టీడీపీలోనే ఉన్న రమేష్ ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో భాగంగా పార్టీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ లో చేరారు. ఆ తర్వాత టీఆర్ఎస్ కు రాజీనామాచేసి బీజేపీ, కాంగ్రెస్ లో కూడా చేశారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. తర్వాత క్రమశిక్షణా చర్యల కింద రమేష్ ను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. దాంతో మళ్ళీ బీజేపీలో చేరారు. చివరి వరకు రమేష్ బీజేపీ నేతగానే ఉన్నారు.

**రెండు జాతీయ పార్టీల్లో విషాదం**
డీఎస్ అయినా రమేష్ అయినా తామున్న పార్టీల్లో కమిటెడ్ గానే పనిచేశారు. గిరిజనుల్లో రమేష్ కు మంచి నేతగా పేరుంది. రమేష్ భార్య సుమన్ రాథోడ్ కూడా ఖానాపూర్ నుండి రెండుసార్లు టీడీపీ ఎంఎల్ఏగా పనిచేశారు. బీసీల్లో డీఎస్ కు పట్టుందనే చెప్పాలి. ఇద్దరు కొడుకుల్లో ఒకళ్ళు సంజయ్ నిజామాబాద్ కాంగ్రెస్ మేయర్ గా పనిచేస్తే మరో కొడుకు ధర్మపురి అర్వింద్ బీజేపీ తరపున రెండోసారి నిజామాబాద్ ఎంపీగా ఎన్నికయ్యారు. మొత్తంమీద ఇద్దరు నేతలు ఒకేరోజు మరణించటం రెండుపార్టీలకు తీరని లోటనే చెప్పాలి.

# మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రకటించారు.కాగా, రమేష్ 1999లో టీడీపీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా రమేష్ రాథోడ్ ఎన్నికయ్యారు. 2009లో కూడా అదే పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా టీడీపీ నుంచి బీఆర్ఎస్ లో చేరారు. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్ లో చేరి 2018లో ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. జూన్ 2021 లో బీజేపీలో చేరారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో టికెట్ ఆశించినప్పటికీ దక్కలేదు.

**రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..**
ఆదిలాబాద్ మాజీ ఎంపీ, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రమేష్ రాథోడ్ మరణం దిగ్భ్రాంతి కలిగించింది అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ…కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

**రాథోడ్ రమేష్ సేవలు మరువలేనివి : కేంద్ర మంత్రి బండి సంజయ్**
రాథోడ్ రమేష్ గారి మరణ వార్త కలచివేసిందని, వారి సేవలు మరుపలేనివి అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మృతిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన తన సంతాపం తెలియజేశారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపి నేత రాథోడ్ రమేష్ గారు అనారోగ్యంతో మరణించారన్న వార్త నన్ను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. ఆదిలాబాద్ ఎంపీగా, జిల్లా పరిషత్ చైర్మన్ గా వారు అందించిన సేవలు మరువలేనివని, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం వారు చేసిన కృషి అసామాన్యమని కొనియాడారు. రమేష్ రాథోడ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు, అభిమానులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అని బండి సంజయ్ తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు

# హైదరాబాద్‌కు దీటుగా వరంగల్!

**(మొదటి పేజీ తరువాయి)**
ఉండేలా చూడాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ టెక్స్ టైల్ పార్కు నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితుల సంక్షేమం విషయంలో రాజీపడొద్దని, నిర్వాసిత కాలనీలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్వాసితులకు ప్లాట్లు ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వరంగల్ నగర అభివృద్ధిపై ఇక నుంచి ప్రతీ 20 రోజులకు ఒకసారి ఇంచార్జ్ మంత్రి సమీక్ష నిర్వహించాలని సీఎం పేర్కొన్నారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. వరంగల్ లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని.. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం సూచించారు.



వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం విషయంలో ఇష్టారీతిన అంచనా వ్యయం పెంచడంపై అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అప్రూవల్ లేకుండా రూ.1100 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.1726 కోట్లకు ఎలా పెంచారని అధికారులను ప్రశ్నించారు. కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం ఎలా పెంచుతారని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమేంటన్న సీఎం... నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు సీఎం తేల్చి చెప్పారు.

# రైతులకు న్యాయం చేస్తాం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**విశ్వంభర, ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమ్మకంతో కాల్వకు భూములిచ్చిన రైతుల రుణం తీర్చుకోలేనిదని, వారికి న్యాయం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హిమాంనగర్ సమీపంలోని సీతారామ అనుసంధాన కాల్వ పనులను శనివారం పరిశీలించారు. హిమాంనగర్ నుంచి పనులు జరిగే ప్రదేశం వరకు ద్విచక్ర వాహనం నడుపుతూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి వెళ్లారు. పరిహారం ఎంతిస్తామో తెలియకపోయినా భూమి, పంటను నష్టపోయి కాల్వ తవ్వేందుకు సహకరించిన ప్రతి రైతుకు రుణపడి ఉంటామన్నారు. ఇలాంటి కర్షకులందరికీ ముఖ్యమంత్రితో చెక్కులు ఇప్పించేలా చూస్తామని తెలిపారు. రైతుల పిల్లలకు జీవనోపాధి కల్పించేలా చొరవ చూపుతామన్నారు. బొర్రా రాజశేఖర్, గుత్తా వెంకటేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం నగరంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం విస్తృతంగా పర్యటించారు. వివిధ డివిజన్లల్లో ఇటీవల మరణించిన వ్యాపారవేత్త నయీమ్, మైబూబ్ మియా కుటుంబాలను పరామర్శించారు. తర్వాత ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సర్దార్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజల విజ్ఞప్తులను స్వీకరిస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ బాధ్యులు తమ ప్రాంతాల్లో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ధంసలాపురం చెరువు కాలుష్యాన్ని అరికట్టాలని మత్స్యకారులు మంత్రి తుమ్మలకు వినతి పత్రం సమర్పించారు. నగరం నుంచి వస్తున్న మురుగు నీటి కారణంగా చెరువు కలుషితమవుతుందని అందులో పేర్కొన్నారు.





# విశ్వంభర దినపత్రికకు శుభాకాంక్షలు

- ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలి
- ప్రతి అక్షరం ప్రజల కొరకు దిక్సూచి అవ్వాలి
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు, విశ్వంభర :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి విశ్వంభర దిన పత్రికను వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలకు అందించే సమాచారం స్వచ్ఛమైనదిగా ఉండాలని, ఊహాజనితమైన వార్తల వల్ల కొన్ని పత్రికలు, చానళ్ళు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు అందించే దిశగా కొంతమంది స్వార్థాల కోసం తయారు చేయబడ్డాయని అన్నారు. విశ్వంభర దిన పత్రిక ద్వారా ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉండాలని, ప్రతి వార్త పక్షపాత ధోరణి లేకుండా ప్రజలకు అందించడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. నూతనంగా ప్రారంభించిన విశ్వంభర పత్రిక ప్రజలకు మరింతగా చేరువ అవ్వాలని కోరుకుంటూ పత్రిక యాజమాన్యానికి ,సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసారు. విశ్వంభర దిన పత్రిక అక్షరం సాక్షిగా ప్రారంభమైన అనతికాలంలోనే తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విశ్వంభర పత్రిక ప్రతి ఇంటికి సమాచారాన్ని చేరవేస్తు నిష్పక్షపాతంగా వార్తలను అందించడంలో ముందుంటుంది. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మెప్పును పొందుతూ ప్రధాన పత్రికలకు ధీటుగా దూసుకెళ్తుంది. ఈ కార్యక్రమంలో ట్రస్మా నల్గొండ జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాసులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనంత చంద్రశేఖర్ గౌడ్, చెరుకుపల్లి వెంకన్న , చెరకు అజయ్ , చెరకు విజయ్ , వెంకన్న తదితరులు పాల్గొన్నారు



# చేనేత కార్మికులకు అండగా ఉంటా

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**చండూరు, విశ్వంభర :** చేనేత కార్మికుల సమస్యలను అన్ని విధాల పరిష్కారం అయ్యేలా చొరువ చూపిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ కోడి శ్రీనివా సులు నేతృత్వంలో చండూరు చేనేత కార్మిక సంఘం, చేనేత పరిరక్షణ సేవా సమితి (సిపి ఎస్) ఆధ్వర్యంలో పలువురు చండూరు పట్టణ చేనేత కార్మికులు శనివారం మునుగో డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలి సి విన తి పత్రం అందజేశారు. ఆయన కార్మికు లతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. త్రిఫ్ట్ ఫండ్ కు సంబంధించి పెండింగ్ చెక్కులు వెంటనే విడుదల అయ్యేలా ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రితో మాట్లాడి ఏర్పాటు చేస్తానన్నారు. చేనేత మిత్ర ద్వారా నెలకు 3,000 వచ్చేలా చూస్తానన్నారు. ప్రా ధాన్యత క్రమంలో సమస్యలను ఒక్కొక్కటిగా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారంతోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని గుర్తు చేశారు. వైఎస్ఆర్ హయాంలో 312 కోట్ల చేనేత రుణాలను మాఫీ చేయించిన విషయం అందరికీ తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు తిరందాసు శ్రీనివాసులు, చేనేత పరిరక్షణ సేవా సమితి(సిపిస్)అధ్యక్షుడు రాపోలు ప్రభాక ర్, కర్నాటి శ్రీనివాసులు,ఏలె శ్రీను,చెరుపల్లి కృష్ణ, ఏలే సుధాకర్, పున్న బిక్షమయ్య,ఏలే సత్తయ్య, రాపోలు లక్ష్మయ్య, ఏలె చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.




# ప్లేస్ ఆఫ్ సేల్స్- టెక్స్ టైల్ యాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి

**మునుగోడు , విశ్వంభర :** ప్లేస్ ఆఫ్ సేల్స్ – టెక్స్ టైల్ యాప్‌ను మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో యాప్ నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యాప్ చేనేతలకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. సరిగ్గా ఈ యాప్‌ను ఉపయోగించుకుంటే ఫోన్ లోనే మొత్తం వ్యాపారం చేసుకోవచ్చు అని ఎక్కడపడితే అక్కడికి వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదని అన్నారు. సమయం వృధా కాకుండా మంచి ప్రోడక్ట్స్‌ను అందిస్తే ఏ రంగం అయినా వృద్ధిలోకి వస్తుందని అన్నారు. సెక్యూరిటీ పరంగా జాగ్రత్తగా వ్యవహరించాలని పలు సూచనలు యాప్ నిర్వాకుడి తెలియజేసి అభినందించారు. అనంతరం యాప్ నిర్వాహకులు మాట్లాడుతూ చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలు అమ్మలేక అవస్థలు పడుతున్నారని, దానిని అధిగమించడానికి ఈ యాప్‌ను తయారు చేశామని అన్నారు. దీని ద్వారా చేనేత వస్త్రాలను గ్లోబల్ మార్కెట్లోకి కస్టమర్స్ కి నేరుగా అందుబాటులోకి తీసుకొని వచ్చామని, దీని ద్వారా సులభంగా వారి యొక్క వస్త్ర ఉత్పత్తులను అమ్ముకోవచ్చు అని తెలిపారు



# ఉద్యోగ విరమణ సన్మానోత్సాహం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధి నిర్వహణ చేస్తున్న గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తెరా వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ మొలుగురి సత్య లక్మి మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో విరమణ సహజ ప్రక్రియ అని, ఇన్ని రోజులు పాఠాలు బోధించిన ప్రధానోపాధ్యాయులు ఇక విరమణ అనంతరం సమాజ సేవకు ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు వెంకన్న, స్వామి, రవి, వరప్రసాద్, శ్రీనివాసచారి, అనురాధ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# ఘనంగా కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర పారాయణం

**విశ్వంభర, అంబర్‌పేట :** ఇంటర్నేషనల్ వాసవి క్లబ్స్ వాసవి ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్ర పారాయణం 41 రోజుల సందర్భంగా అంబర్‌పేట చే నెంబర్ శంకర్ నగర్ ఎల్లమ్మ గుడి నుంచి అమ్మ వారికి పట్టు చీర పసుపు కుంకుమ సారె తీసుకుని సన్నాయి మేళం తోని ఊరేగింపుగా గోల్ నాక సాయి బాబా గుడి వరకు కొనసాగింది. తరువాత అభిషేకం, లక్ష పుష్పార్చన కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్ర పారాయణం అనంతరం భోజనాలు నిర్వహించారు. వాసవి వనిత అంబర్ పేట 6 నం క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్టిక్ వీ 102 ఏ కోశాధికారి ఇరుకుల్ల పద్మజ, ఇరుకుల్ల నాగభూషణం, డిస్టిక్ ఇంచార్జి తాలాపల్లి పద్మజ జోన్ చేర్మన్ రాజేశ్వరి ప్రెసిడెంట్ తాలపల్లి కళ్యాని సెక్రటరి చేపూరి గీత, వేణుగోపాల్ కోశాధికారి గూడల సంధ్య, జగదీశ్వర్, భారీ ఎత్తున మహిళలు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.






# రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ

**విశ్వంభర, చివ్వేంల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు బంధు (భరోసా) పథకంపై రైతులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని ప్రాథమిక సహకార సంఘాల డీసీవో పద్మ సూచించారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మారినేని సుధీర్ రావు అధ్యక్షతన శనివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన ప్రాంగణంల ప్రత్యేక జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగిల్ విండో బ్యాంకు ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని చెప్పారు. రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. త్వరలో మీ సేవ ద్వారా అన్ని రకాల సేవలు కల్పిస్తామని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు 5 సబ్ సెంటర్లలో ఉన్నాయని అన్నారు.



రైతు భరోసా పథకానికి ఎంత భూమికి భరోసా ఏంతివ్వాలని రైతులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఎక్కువ మంది రైతులు ఎంత భూమి సాగు చేస్తే అంతటికి ఇవ్వాలని అభిప్రాయాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎల్పి కృష్ణ, సీఈఓ వాసు, ఏవో ఆశా కుమారి, ఏఈవో లు పవన్, సాయి, వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ సైదులు పాల్గొన్నారు.

# కవితా కళానిధి బలిజేపల్లి

కాలం ఎదైనా, ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. 20 వ దశకారంభంలో ఒకరు నాటకీకరించిన కథనే స్వీకరించి పలువురు అనువదించడం, అదే కథనే నాటకాలుగా రాయడం జరిగింది. నాటకాలలో పద్యాలకు, పాటలకు ప్రాదాన్యత అధికంగా ఇచ్చిన కాలమది. ఈ విధంగా పలు పలువురు రచయితలు అత్యధికంగా రాసి ప్రదర్శనలకు అవకాశం కల్పించిన నాటకం సత్య హరిశ్చంద్ర. అందునా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి హరిశ్చంద్ర నాటకం మిగుల ప్రజాదరణ పొందింది. ఎందరో నాటక రచయితలకు సినిమా నిర్మాత దర్శకులకు స్ఫూర్తిని కలిగించిన లక్ష్మీకాంత కవి గురించి తెలియ పరిచే చిరు ప్రయత్నం ఇది. బలిజేపల్లి లక్ష్మీకాంతం లేదా లక్ష్మీకాంత కవి (డిసెంబరు 23, 1881 జూన్ 30, 1953) స్వాతంత్ర్య సమరయోధులు, అవధాని, నాటక రచయిత, రంగస్థల, సినిమా నటులు.

## నేడు బలిజేపల్లి లక్ష్మీకాంతం వర్ధంతి

"త్రిరమై సంపదలెల్ల వెంటనొకరీతిన్"...'మాయామేయ జగంబె నిత్యమని, సంభావించి'... 'చతురంభోధి పరీత భూధరణీ రక్షాదక్ష' ... సాగిరావు ఏరికిన్ ఏసరికి యేపాటు విధించెనో... "దళమౌ పయ్యేదలో నడంగియు.. లాంటి హరిశ్చంద్ర నాటకంలోని పద్యాల మాధుర్యాన్ని ఒకసారైనా ఆస్వాదించని తెలుగు నాటక అభిమానులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఇవి అన్నీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి విరచిత 'సత్య హరిశ్చంద్రీయము' నాటకం లోనివే.




భారతీయ భాషల్లో 'హరిశ్చంద్ర' నాటకానికి ఒక ప్రత్యేక స్థానముంది. మూకీ యుగంలో నాలుగు సార్లు, టాకీ యుగంలో ఇరవై సార్లు వెండితెర కెక్కిన ఒకే ఒక కథ ఇది. 1913లో చలనచిత్ర పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే 'రాజా హరిశ్చంద్ర' సినిమాను పూర్తిస్థాయి మూకీ చిత్రంగా మరాఠీలో నిర్మించిన తరవాత అదే కథను 'సత్యవాది రాజా హరిశ్చంద్ర' పేరుతో మరాఠీలోనే 1917లో లఘుచిత్రంగా నిర్మించారు. ఇదే మూల కథను 'సత్యవాది రాజా హరిశ్చంద్ర' పేరుతోనే రుస్తుంజీ ధోతీవాలా కూడా బెంగాలీ భాషలో నిర్మించాడు. తెలుగులో 1935లో ఒకసారి 1956లో మరొకసారి 1965లో చివరి సారి హరిశ్చంద్ర సినిమా వచ్చింది. ఇన్నిసార్లు ఇదే కథను సినిమాగా మలచడానికి కారణం... ఆ నాటికే ముందే ఆ నాటకం ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేయడమే. ఆ నాటక కర్త కవితా కళానిధి బలిజేపల్లి కావడం తెలుగు వాళ్లకు గర్వకారణం. ఆ నాటకంలోని పద్యాలు, సంభాషణలు నాడు వెలుగు వారి నోళ్లలో నిరంతరం నానుతునే ఉండేవి.

1935లో తెలుగు తొలిటాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' నిర్మించిన స్టార్ ఫిలిం కార్పొరేషన్ సంస్థ 'హరిశ్చంద్ర' సినిమాను తెలుగులో నిర్మించినప్పుడు బలిజేపల్లి నాటకాన్ని స్ఫూర్తిగా తీసుకోవడం గమనార్హం. ఆ చిత్రానికి మాటలు, పాటలు, పద్యాలు బలిజేపల్లి కవే సమకూర్చడం విశేషం.

1936లో అదే ఈస్ట్ ఇండియా కంపెనీ వారు సీ పుల్లయ్య దర్శకత్వంలో 'సతీ అనసూయ', 'ధృవ విజయము' జంట సినిమాలను నిర్మించారు. ఈ చిత్రాల నిర్మాణం కలకత్తాలోనే జరిగింది. ఈ చిత్రాలకు కథ, మాటలు, పాటలు, పద్యాలు రాసేందుకు బలిజేపల్లిని చిత్తజల్లు పుల్లయ్య కలకత్తాకు ఆహ్వానించారు. తెలుగులో వచ్చిన తొలిబాలల చిత్రం ధృవ విజయం కావడం విశేషం.

1938లో జయా ఫిలిమ్స్ సంస్థ చిత్రపు నరసింహారావు దర్శకత్వంలో తొలిచిత్రంగా 'కృష్ణ జరాసంధ' సినిమాను నిర్మించింది. వేలూరి శివరామశాస్త్రి రచించిన కథకు బలిజేపల్లి పాటలు, పద్యాలు సమకూర్చారు. 1939లో జగదీశ్ ఫిలిమ్స్, అధినేత వైవీ రావు (యరగుడిపాటి వరదరావు) దర్శకత్వంలో 'మళ్ళీపెళ్లి' అనే సాంఘిక చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రానికి మాటలు, పాటలు బలిజేపల్లి రాశారు.

192123 ప్రాంతాల్లో కాళ్ళకూరి నారాయణరావు వరకట్న పిశాచిని నిరసిస్తూ 'వరవిక్రయం' అనే నాటకాన్ని రచించారు. ఆ నాటకానికి బలిజేపల్లి మాటలతోబాటు అందుకు అవసరమైన పాటలు కూడా రచించి మంచి స్క్రిప్టును తయారు చేశారు. పుల్లయ్య కోరికమీద అందులో బలిజేపల్లి పిసినిగొట్టు భూస్వామి 'సింగరాజు లింగరాజు' పాత్రను పోషించారు. 1940లో బలిజేపల్లి ఏవీఎం వారు నిర్మించిన 'భూకైలాస్', న్యూటన్ స్టూడియో తరఫున వై.వి.రావు నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన 'విశ్వమోహిని' సినిమాలకు సంభాషణలు సమకూర్చారు. శ్రీజగదీశ్ సంస్థ బ్యానర్ మీద దర్శకనిర్మాత సమర్పించిన రెండవ చిత్రం 'విశ్వమోహిని'. ఈ చిత్రానికి మాటలు, పాటలు సమకూర్చింది బలిజేపల్లి లక్ష్మీకాంతం.1942లో "జీవన్ముక్తి" చిత్రానికి మాటలు పాటలు సమకూర్చిన బలిజేపల్లి 'రాజగురు' పాత్రను పోషించారు. బుర్రకథను ఆధారం చేసుకొని బాలనాగమ్మ' చిత్రాన్ని నిర్మించగా, బలిజేపల్లి అద్భుతమైన కథను సమకూర్చి, దానికి సంభాషణలు, పాటలు రాశారు. ఇందులో బలిజేపల్లి నవభోజరాజు పాత్రను పోషించడం విశేషం. 1944లో శ్రీజగదీష్ ఫిలిమ్స్ వై.వి.రావు 'తహసిల్దార్' అనే చిత్రాన్ని నిర్మించగా బలిజేపల్లి 'సీతయ్య', 'పానకాలు' అనే రెండు పాత్రలను పోషించారు.



బలిజేపల్లి రచించిన నవల 'బ్రహ్మరథం' ఆధారంగా 1947లో శ్రీవెంకట్రామా పిక్చర్స్ బ్యానర్ మీద మీర్జాపురం రాజావారు ప్రథమ కానుకగా చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో 'బ్రహ్మరథం' చిత్రాన్ని నిర్మించగా, చిత్రానికి కథ, మాటలు, పాటలు బలిజేపల్లి సమకూర్చారు. బలిజేపల్లి కథ, మాటలు, పాటలు సమకూర్చి నటించిన చివరి సినిమా 'రక్షరేఖ' (1949). ఆర్. పద్మనాభన్ నిర్మించి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు, భానుమతి, అంజలీదేవి, కస్తూరి శివరావు, వంగర వెంకటసుబ్బయ్య, కనకం, గంగారత్నం ముఖ్య తారాగణం. ఇందులో బలిజేపల్లి ప్రతాప మహారాజు పాత్రను పోషించారు. అక్కినేని ఆయన కొడుకు సుధాకరుడుగా నటించారు.


గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా ఇటికంపాడులో 23 డిసెంబర్, 1881 సంవత్సరంలో నరసింహ శాస్త్రి, ఆదిలక్ష్మమ్మలకు జన్మించిన బలిజే పల్లి 30 జూన్,1953న కాళహస్తిలో పరమ పదించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా దాదాభాయి నౌరోజీ

## నేడు దాదాభాయి నౌరోజీ వర్ధంతి

దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ పార్టీకి వాస్తవానికి ప్రాతః స్మరణీయులు. ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఆయన ఒకరు. మూడు పర్యాయాలు జాతీయ కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన నాయకులు. నౌరోజీ జీవిత చరిత్ర 19 వ శతాబ్దంలో భారతీయ జాతీయవాదుల పోరాటాలను స్పష్టంగా తెలుపు తుంది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందు నుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. నౌరోజీ, ఏఓ హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించారు. 1892 నుంచి 1895 వరకు ఇంగ్లాండ్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో కొనసాగారు. ఆయన ఆ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి.



దాదాభాయ్ నౌరోజీ (సెప్టెంబర్ 4, 1825 - జూన్ 30, 1917) పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకులు, బ్రిటీష్ చట్టసభ సభ్యుడైన తొలి ఆసియా ఖండ వాసి అయిన దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4 న, బొంబాయిలో నవసారిలో ఒక పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్ జీదోరోజి జొరాష్ట్రియన్ మత పురోహి తులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల ఎలిఫెన్‌స్టోన్ ఇనిస్టిట్యూట్‌లో చదివారు. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్స హించ దానికి జరిగిన ప్రత్యేక తరగతులలో ఆయన బోధించారు. తన జొరాస్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటుపడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి.

కామా & కో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్‌పూల్ లో బ్రిటన్‌లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదాభాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ & కో.' ప్రాంభించారు. ఇంగ్లండ్‌లో భారతీయుడు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే. 1865 నుండి 1866 వరకు, లండన్ విశ్వ విద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యా యులుగా కూడా పనిచేశారు. 1865 లోనే, భారతీయ రాజకీయ, సామాజిక మరియు సాహిత్య సమస్యలు మరియు విషయాలను చర్చించి, ఇంగ్లాండ్ ఓటర్లకు అనుకూలంగా మార్చడం ఉద్దేశ్యంతో దాదాభాయ్ నౌరోజీ 'లండన్ ఇండియన్ సొసైటీ'ని స్థాపించారు. ఆయన 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్' ఏర్పాటులో కీలక పాత్ర పోషిం చారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క ప్రధాన సంస్థ, స్థాపన ప్రధాన ఉద్దేశం బ్రిటిష్‌వారి ముందు భారతీయుల శక్తిని బలోపేతం చేయడం. 1874 లో బరోడా ఇన్స్టిట్యూట్ యొక్క మున్షి పోస్ట్ బాధ్యతను స్వీకరిం చారు.1875 లో, అతను బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడు అయ్యా రు. నౌరోజీ 1886 లో మొదటిసారిగా బ్రిటిష్ పార్లమెంట్ పదవి కోసం పోటీ చేసి, ఓటమి పాలు కాగా, 1892 లో తన రెండవ ప్రయ త్నంలో విజయం సాధించి, హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైనారు. బ్రిటిష్ పార్లమెంటులో ఎన్నికైన మొదటి ఆసియా వ్యక్తిగా 1892 నుండి 1895 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొన సాగారు. బ్రిటిష్ పార్లమెంట్ లో భారత ఉప ఖండంలో వలస రాజ్యాల దోపిడీ సమస్యను మొదట లేవనెత్తారు. 1895 సంవత్స రానికి భారత వ్యయం పై రాయల్ కమిషన్ సభ్యులుగా కూడా నియమించ బడ్డారు.

బరోడా మహారాజు శయాజీ రావు గైక్వాడ్ కాలంలో సంస్థాన దివానుగా పని చేసారు.1874 లో, ఆయన బరోడా ప్రధాన మంత్రి, 1885 నుండి 1888 వరకు ముంబై శాసన మండలి సభ్యుడయ్యారు. అలా ప్రజా జీవితంలో ప్రవేశించిన ఆయన "గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా" గా ప్రసిద్ధి గాంచారు.

భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులు సురేంద్రనాథ్ బెనర్జీతో పాటు వ్యవస్థాపకుల్లో ఒకరు. 1886 లో నౌరోజీ దాని అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

1893 లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రెండోసారి అధ్యక్షత వహించారు. 1906 లో జరిగిన కలకత్తా సమావేశానికి కూడా అధ్యక్షత వహించి మూడు సార్లు ఈ పదవి పొందిన తొలి నాయకులుగా అవతరించారు.

దాదాబాయి నౌరోజీ పలు గ్రంథాలు రచించారు. ఆయన రాసిన పుస్తకం "పావర్టీ మరియు అన్బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" అనే పుస్తకం భారత దేశం నుండి బ్రిటన్ తరలిస్తున్న నిధుల గురించి వివరించిన మొదటి పుస్తకం. అలాగే పార్సీల మర్యాదలు మరియు ఆచారాలు, యూరోపియన్ మరియు ఆసియాటిక్ జాతులు, భారత దేశానికి కావలసినవి మరియు సాధనాలు, భారత దేశంలో పేదరికం మరియు బ్రిటిష్ రహిత నియమం, పార్సీ మతం తదితర రచనలు చేశారు. ఆయన 30 జూన్ 1917 న మరణించారు. బ్రిటిష్ పార్లమెంటులో భారతీయుల కోసం వాదించిన, బ్రిటిష్ విధానాలను విమర్శించిన నిజమైన జాతీయ వాది దాదా భాయిని ప్రతి భారతీయుడు గుర్తెరగాల్సిన అవసరం ఉంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

సీఎన్ఆర్‌రావుగా ప్రసిద్ధిచెందిన చింతామణి నాగేశ రామచంద్ర రావు (జూన్ 30, 1934) భారతీయ శాస్త్రవేత్త. భారతరత్న పురస్కార గ్రహీత. ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు రసాయన శాస్త్ర పరిశోధకులు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగంలో అనేక అంశాలు ఆయన వెలుగులోకి తెచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. సీవీరామన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంల తరువాత భారతరత్న అవార్డుకు ఎంపికైన మూడవ శాస్త్రవేత్త.
ఆయన 1934 జూన్ 30న బెంగళూరులో ఓ కన్నడ భాష మాట్లాడే దేశస్థ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి హనుమంత నాగేశ రావు విద్యాశాఖలో ఉద్యోగి. అమ్మ నాగమ్మ. నాగమ్మ ప్రాథమిక విద్య వరకే చదివినా ఆయనకు ఆమె తొలి గురువు. భారత రామాయణ కథలు, పురందర దాసు కీర్తనలు మొదలైనవి వినిపించేది. నాన్న ఆంగ్లం నేర్పించేవారు.



# అసమాన మేధావి నాగేశ రామచంద్ర రావు

## చింతామణి నాగేశ రామచంద్ర రావు జయంతి

రామచంద్ర ఉన్నత పాఠశాలలో ఉన్న సమయంలో భారత స్వాతంత్ర్యోద్యమం ఊపందుకుంది. ఆ సమయంలో సుభాష్ చంద్రబోస్ ఆయనకు ఆరాధ్య నాయకులు. నేతాజీ పోరాటాన్ని గురించి మిత్రులకు కథలుగా చెప్పేవారు. పదేళ్ళు నిండక మునుపే లోయర్ సెకండరీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పెద్దయ్యే కొద్దీ స్వాతంత్ర్యోద్యమ తీవ్రత కూడా పెరిగింది. అందుకు గాంధీ టోపీ, ఖద్దరు ధరించారు.

ఉన్నత పాఠశాల విద్య పూర్తయ్యే సరికి భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ మైసూరు సంస్థానం మాత్రం ఇంకా మహారాజుల పాలనలో ఉండేది. దాన్ని భారత్‌లో విలీనం చేయాలంటూ పోరాటం మొదలైంది. రామచంద్ర కూడా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. పదిహేడేళ్ళకే బీయెస్సీ పట్టా అందుకుని మైసూరు విశ్వ విద్యాలయంలో సరికొత్త రికార్డు నెలకొల్పారు.

మైసూరు విశ్వవిద్యాలయం నుంచి 1951లో, ఆయన బీఎస్సీ డిగ్రీ పుచ్చుకున్న తరువాత కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో మాస్టర్స్ చదువు పూర్తి చేసుకొని, 1958లో పర్డ్యూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సాధించి బెంగళూరు లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో లెక్చరర్‌గా చేరారు. 1963లో కాన్పూర్ ఐఐటీలో అధ్యాపకునిగా చేరారు.19841994 మధ్య కాలంలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి డైరెక్టరుగా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయం, కాలిఫోర్నియా విశ్వ విద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. "జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రిసెర్చి"సంస్థను స్థాపించారు. ఇంకా చాలా ఉన్నత పదవులు నిర్వహించారు.

సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్సు రంగాలలో సీఎన్ఆర్ రావు శాస్త్రవేత్తగా ప్రసిద్ధుడయ్యారు. ట్రాన్సిషన్ మెటల్ ఆక్సైడుల గురించి అతని పరిశోధనలు ఆ రంగంలో ముఖ్యమైనవి. నానో పదార్థాల రంగంలో రావు విశేష కృషి చేశారు. 1400 పరిశోధన పత్రాలను వెలువరించారు. 45 పుస్తకాలు ప్రచురించారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కర్ణాటక అత్యున్నత పురస్కారం కర్ణాటక రత్న పురస్కారాలను అందుకున్నారు. 2000 సంవత్సరంలో రాయల్ సొసైటీ ఆయనకు హ్యూగ్స్ మెడల్‌ను అందించింది.

2005 నుంచి ప్రధాన మంత్రి శాస్త్రీయ సలహా మండలికి అధిపతిగా ఉన్నారు. ఆయన 1963 నుంచి 1976 వరకూ కాన్పూర్ ఐఐటీలో డీన్‌గా వ్యవహరించారు. 1984 నుంచి పదేళ్ల పాటు ఐఐఎస్‌సీకి సంచాలకులుగా పని చేశారు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగానికి, పదార్థ పరిశోధన ప్రయోగ శాలకు వ్యవస్థాపక ఛైర్మన్. బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చ్‌కు ఆయన వ్యవస్థాపకులు.

1968 శాంతి స్వరూప్ భట్నాగర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రైజు, 1974 పద్మశ్రీ, 1985 పద్మ విభూషణ్, 2000 కర్ణాటకరత్న, 2000 హ్యూస్ మెడల్ రాయల్ సొసైటీ, 2004 భారత ప్రభుత్వం నుంచి ఇండియా సైన్సు అవార్డు పొందిన మొదటి వ్యక్తి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆండ్ సైన్సెస్, ఫ్రెంచ్ అకాడమీ, జపాన్ అకాడమీ, ఫ్రాన్సు ప్రభుత్వంచే అవార్డులు, 2013లో అత్యున్నత భారతరత్న అవార్డు పొందారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**



## ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

**విశ్వంభర, హైదరాబాద్ :** జాతీయ గణాంక దినోత్సవము- 2024 వేడుకలు కలెక్టర్ ఆఫీసులోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 18వ జాతీయ గణాంక దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై " జిల్లా గణాంక దర్శిని-2023 " పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరము18వ జాతీయ గణాంక దినోత్సవానికి "నిర్ణయాల కొరకు సమాచార వినియోగం" నేపథ్యం ఇవ్వడం వల్ల మన దేశ సాంఘిక-ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధికి విధాన రూపకల్పనలో గణాంకాల పాత్ర, ప్రాముఖ్యతపై ప్రజల్లో, ముఖ్యంగా యువతరంలో అవగాహన కల్పించడం గణాంకాల దినోత్సవాన్ని జరుపుకోవడం యొక్క ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ దిశగా ఈ శాఖలో ఈ ప్రచురణకి ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేసిన ప్రతి ఒక్క గణాంక అధికారికి, సమాచారాన్ని సకాలంలో అందించిన జిల్లా అధికారులందరికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళిక అధికారి డా. ఎన్ సురేందర్ మాట్లాడుతూ.. 18 వ జాతీయ గణాంక దినోత్సవం యొక్క ప్రాముఖ్యాన్ని వివరిస్తూ 2024లో, సుస్థిర అభివృద్ధి సూచీలను సాధించే క్రమంలో దేశం ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివిధ ఆర్థిక పరమైన, విధాన పరమైన నిర్ణయాలకు, సంక్షేమ పథకాల అమలుకు ప్రస్తుత గణాంకాల అవసరాలు వాటి సేకరణ విశ్లేషణ ఆవిష్కరణలను ప్రతిబింబించే అంకితమైన ఇతివృత్తంతో ఈ వేడుక ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకున్నదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించిన 'జిల్లా గణాంక దర్శిని-2023" పుస్తకంలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం విద్య, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ప్రజా ఆర్థిక వ్యవస్థ, సామాజిక భద్రత మొదలగు అంశాల సంపుటి విద్యావేత్తలకు, పరిశోధకులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ రెడ్డప్ప, డివైఎస్ ఓ లు ఉమామహేశ్వరి, ఆనంద్ కుమార్,మనోహర్, ప్రమీలరాణి, సూపరిండెంట్ మాధవి, ప్రణాళిక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సెట్విన్‌లో పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోస్టులలో పని చేసి పదవీ విరమణ చేస్తున్న వారిని సత్కరించే కార్యక్రమం శనివారం నిర్వహించారు. పురానీ హవేలీలోని సెట్విన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు హాజరై సంస్థలో పనిచేసి పదవి విరమణ చేస్తున్న సంస్థ సూపరింటెండెంట్ పిబిఎస్ ప్రసాద్ రావు, డ్రైవర్లు తౌఫిక్, మహమ్మద్ ఇబ్రహీం, అటెండర్లు శంషుద్దీన్, నర్మదా, లీలావతి, మహమ్మద్ ఖాసిం తదితరులను సత్కరించారు. సందర్భంగా ఏండి వేణుగోపాలరావు మాట్లాడుతూ.. పదవి విరమణ చేసిన ఉద్యోగులు సంస్థకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, మేనేజర్ ఎంఏ మోఈజ్, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, సంస్థలో పనిచేస్తున్న కోఆర్డినేటర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రౌనక్ రాజ్‌సింగ్ సహానికి బంగారు పతకం



**విశ్వంభర, హైదరాబాద్ :** టైక్వాండో ఛాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన రౌ నక్ రాజ్ సింగ్ సహాని సత్తా చాటి బంగారు పథకాన్ని గెలుచుకున్నాడు. ఈనెల 28, 29 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ లక్నోలో జరిగిన2024- ఛాంపియన్ షిప్ టైక్వాండో క్రీడల పోటీల్లో అద్భుత ప్రదర్శన కనపరచి పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం తెలంగాణ టైక్వాండో అసోసియేషన్ హెడ్ కోచ్ పీ బాలరాజు రౌనక్‌సింగ్‌ను అభినందించి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్ బాలరాజు మాట్లాడుతూ.. తాము ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ క్రీడాకారులుగా సమాజానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు అనుకున్న లక్ష్యసాధన కోసం ప్రతిక్షణం సాధన అవసరమని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

### కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కళారాణి



**విశ్వంభర, చివ్వెంల :** సమాజంలో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది భావి భవిష్యత్తుకు మార్గదర్శకులుగా రూపొందించే బాధ్యత వహిస్తున్న ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కళారాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం ప్రధానోపాధ్యాయులు తీకుల్ల సాయిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిషత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవ నియమైన పాత్ర ఉంటుందన్నారు. విద్యార్థుల బంగారు భవిషత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందించిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో 40 సంవత్సరాల పాటు ఇష్టంతో పని చేశానని చెప్పారు. విద్యార్థులకు తన సొంత డబ్బులతో పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, డేగ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తండ్రుల పేరిట పురస్కారాలతో
# కుటుంబ వ్యవస్థ బలోపేతం

- పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్
- ఉత్సాహంగా పురస్కార ప్రదానోత్సవం




**విశ్వంభర, కరీంనగర్ :** తండ్రుల పేరిట పురస్కారాలు ఇవ్వడం ప్రతిభావంతులకు ప్రోత్సాహం ఇవ్వటమే కాకుండా కుటుంబ వ్యవస్థను కూడా మరింత బలోపేతం చేస్తుందని పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. సమైక్య సాహితీ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్‌లో జరిగిన విశిష్ట పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గొప్ప వ్యక్తులకు పురస్కారం గొప్ప సంస్కృతి అన్నారు. తమ తండ్రుల పేరిట అయిదుగురు మిత్రులు ఆయా రంగాల్లో అవిరళ కృషి చేస్తున్న దిగ్గజాలకు ఈ పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. తల్లి దండ్రులను, మూలాలను ఎన్నటికీ మరువరాదనే ఆదర్శాన్ని ఈ పురస్కారాలు చాటుతాయని అన్నారు. 2017 నుంచి అందిస్తున్న ఈ పురస్కారాలు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయన్నారు. పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ జీ శ్యాంప్రసాద్ లాల్, మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య, రావికంటి శ్రీనివాస్, డాక్టర్ రఘురామన్‌లు వీటిని ప్రదానం చేశారు. శాలువా, మెమెంటోలతో సత్కరించడమే కాకుండా 5116 క్యాష్ అవార్డును ఇచ్చారు. కరీంనగర్‌కు చెందిన కలకుంట్ల సంపత్ కుమారాచార్యుల పేరిట సంగీత పురస్కారాన్ని ఈ సంవత్సరం సంగీత విద్వాంసుడు, తెలుగు రాష్ట్రాలలో వేలాది మందిని గాయకులుగా తీర్చి దిద్దుతున్న సంగీత గురువు రామాచారికి ప్రదానం చేశారు. ఆచార్య రజనీశ్రీ పురస్కారాన్ని ప్రముఖ పేరిణి నృత్య కళాకారుడు ప్రకాశ్‌కు ప్రదానం చేశారు. మాడిశెట్టి మల్లయ్య స్మారక పురస్కారాన్ని ప్రముఖ పాఠ్యపుస్తక రచయిత, ఉత్తమ ఉపాధ్యాయుడు, జాతీయవాది గాజుల రవీందర్‌కు ప్రదానం చేశారు. రావికంటి రామయ్య పురస్కారాన్ని పద్యకవి, అవధాని ముద్దు రాజయ్యకు ప్రదానం చేశారు. డాక్టర్ నాగభూషణం స్మారకార్థం పరిశోధన పురస్కారాన్ని తెలంగాణ నవ చరిత్ర పరిశోధకులు ద్యావనపల్లి సత్యనారాయణకు ప్రకటించగా ఆయన ప్రతినిధికి అందజేశారు. ప్రముఖ కవి అన్నవరం దేవేందర్, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.



## సర్వేల్ నూతన గురుకుల భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం

### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలను శనివారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా ఇంకా ఎటువంటి మౌలిక సదుపాయాలు అవసరమో విద్యార్థులను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే గురుకుల నూతన భవన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి ప్రేమ్ చందర్ రెడ్డి, జెడ్పిటిసి భానుమతి వెంకటేష్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, ఉప్పల లింగస్వామి, మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి సతీష్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, గుత్తా శేఖర్ రెడ్డి, మానుపాటి సతీష్, ఎస్కె షబీర్, దూడల సక్కుబాయి, చిలకరాజు రాజు, పగిళ్ల యాదయ్య, వెనుముల శంకర్ రెడ్డి, చుక్క స్వామి, బోయ నరసింహ, భక్కులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన వంశీ

**విశ్వంభర, ఆమనగల్లు :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో, అనారోగ్యంతో మృతి చెందిన ముద్విన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య కుటుంబాన్ని శనివారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పరామర్శించి బాధిత కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన అప్పారెడ్డి పల్లి గ్రామానికి చెందిన గౌరవరం లక్ష్మారెడ్డి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్, మాజీ జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టెస్టు పుస్తకాలు విడుదల చేయాలి

### బోయ మునిస్వామి



**విశ్వంభర, ఆస్పరి :** కర్నూలు జిల్లాలోని ఆస్పరి మండలంలో జిల్లా పరిషత్ స్కూల్ నందు ఏడవ తరగతి విద్యార్థులకు టెస్టు పుస్తకాలు రాలేదని స్కూలు ప్రారంభమై పది రోజులు కావస్తున్నప్పటికీ ఇంతవరకు ఏడవ తరగతి విద్యార్థులకు టెస్టు పుస్తకాలు రాక ఇబ్బంది పడుతున్నారని స్కూల్లో ఉపాధ్యాయులు టెస్టు పుస్తకాలు లేనందువలన ఏడవ తరగతికి సంబంధించిన సబ్జెక్టులకు పాఠ్యాంశము బోధించడంలో ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి స్పందించి ఏడవ తరగతిలో పెండింగ్‌లో ఉన్నటువంటి టెస్టు పుస్తకాలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కోరింది.



మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి వర్యులు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డా . జేఎన్ వెంకట్ సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

– విశ్వంభర, హైదరాబాద్



## మండల అభివృద్ధికి సహకరించాలి

### జనసేన వీర మహిళ సరోజ

**విశ్వంభర, దేవరకొండ :** మండల అభివృద్ధికి సహకరించమని జన సేన వీర మహిళ అధ్యక్షురాలు సరోజ శనివారం పరిశ్రమ శాఖ మంత్రి టీజీ భరత్‌ను కర్నూల్‌లో తన సొంత కార్యాలయంలో మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం ఇచ్చి కోరారు. దేవనకొండ మండలంలో 44 గ్రామాలు ఉన్నాయని జిల్లాలోని అతిపెద్ద మండలమని, ఈ మండలంలో గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఏ గ్రామానికి వెళ్లిన రోడ్లు, తాగునీరు, డ్రైనేజ్, సాగునీరు సమస్యలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని మంత్రి టీజీ భారత్ కు వెల్లడించారు. మండలంలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్లో ఉన్నాయన్నారు. సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం తదితర అభివృద్ధి కార్యక్రమాలు కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారని దీనిపైన దృష్టి ఉంచి ఆగిపోయిన పనులను పునరుత్త్వం చేసి అభివృద్ధికి పాటుపడాలని కోరారు.



## ఎమ్మెల్యేను కలిసిన భూ నిర్వాసితులు

**విశ్వంభర, దేవరకొండ :** డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చింతపల్లి మండలంలోని కిష్టరాయినిపల్లి, ఈదుల గండి ప్రాంతాలలో భూములను, ఇండ్లను కోల్పోయిన బాధితులు దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలునాయక్‌ను భూ నిర్వాసితులు కోరారు. ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యను పరిష్కరించాలని ఆర్డీఓకు సూచించారు. భూ నిర్వాసితులు అధైర్య పడవద్దు అన్ని విధాలుగా అండగా ఉంటానని తమకు రావలసిన ఆర్ఎండ్ ఆర్ ప్యాకేజీని వచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు యూనిస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ వేణుదర్ రెడ్డి, రైతులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీసీ ఘోష్ కమిషన్ గడువు పెంపు

- ఆగస్టు 31 వరకు పెంచిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు



**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ గడువును మరో రెండు నెలలు పెంచుతూ ప్రభుత్వం ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, బ్యారేజీలపై విచారణకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రేపటితో ఈ కమిషన్ గడువు పూర్తికానుంది. దీంతో ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ ముందు విచారణకు హాజరైన ప్రాజెక్టుకు సంబంధించిన మాజీ ఈఎన్సీలు, ప్రస్తుత ఈఎన్సీలు, సీఈలు, ఇతర ఇంజినీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను పూర్తి వివరాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన విచారణ సందర్భంగా జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. దీంతో 25వ తేదీ వరకు 60 మంది సీల్డ్ కవర్లలో అఫిడవిట్లు దాఖలు చేసినట్లు తెలిసింది.

# నిబంధనలకు లోబడి విద్యుత్ కొనుగోలు

- కేసీఆర్‌పై నిందలు వేద్దామని ఉద్దేశంతోనే ఆరోపణలు
- జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు జగదీష్ రెడ్డి లేఖ



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రత్యేక రాష్ట్ర అనంతరం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఛత్తీస్‌గఢ్‌తో అప్పటి ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి మీడియా సమావేశం పెట్టి లీకులు ఇవ్వడంపై అభ్యంతరం చెప్పానన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రూ. 3.90 విద్యుత్ కొన్నామన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి విద్యుత్‌ను రూ. 17 కొంటున్న పరిస్థితి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో విద్యుత్ విషయంలో ఇరుకున పెట్టాలని చంద్రబాబు ప్రయత్నం చేశారన్నారు. ఏడు మండలాలను ఆంధ్రాకు తీసుకుని.. సీలేరు పవర్ ప్రాజెక్టును ఏపీలో కలుపుకున్నారన్నారు. పీజీసీఎల్‌లో వాటా ఉండాలంటే ఏదో ఒక సంస్థతో విద్యుత్ ఒప్పందం ఉండాలన్నారు. తెలంగాణ తీసుకున్నప్పుడే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు రూ. 4.90 పైసలకు విద్యుత్ తీసుకున్నారన్నారు. కేసీఆర్‌పై నిందలు వేద్దామని ఉద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ డిమాండ్ మేరకు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీతో దేశంలో 17 ప్రాజెక్టులు నిర్మాణవుతున్నాయన్నారు. భద్రాద్రి 800 మెగావాట్లతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ, యాదాద్రి సబ్ క్రిటికల్ టెక్నాలజీతో పవర్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోతో సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అనే తేడా లేకుండా పోయిందన్నారు. అన్నీ అనుకూలంగా ఉన్న తర్వాతనే దామరచర్లలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టామన్నారు. బొగ్గు కేటాయింపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. ప్రతి పవర్ ప్లాంట్ 10శాతం, విదేశీ బొగ్గును వాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రూల్ పెట్టిం దన్నారు. సింగరేణి బొగ్గు ఉండడం వలన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంగా తాము ఒప్పుకోలేదన్నారు. మేము కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని తక్కువ రేటుకు ఇస్తే ఏపీ ప్రభుత్వం ఎక్కువ రేటుకు ఇచ్చిందన్నారు. విద్యుత్ విచారణ కమీషన్ ప్రజలకు తప్పుడు సంకేతం ఇచ్చే ప్రయత్నం చేసిందన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో ఆరువేల కోట్ల నష్టం జరిగిందని తప్పుడు ప్రచారం చేశారన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి కేసీఆర్ ఒక్కరే ఒప్పందం రాసుకోలేదన్నారు. కేసీఆర్, రమణ్‌సింగ్ మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రులుగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం జరిగిందన్నారు. విచారణ కమిషన్ సరిగా లేదని నేను లేఖ రాశానన్నారు. వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే ఉద్దేశంతోనే నేను విద్యుత్ విచారణ కమిషన్‌కు లేఖ రాశానన్నారు. విద్యుత్ ఒప్పందాలు, పవర్ ప్లాంట్ల నిర్మాణాల్లో ప్రభుత్వ రంగ సంస్థల మధ్య జరిగాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వాల మధ్య ఎక్కడైనా లంచం తీసుకునే అవకాశం ఉంటుందా? అని ప్రశ్నించారు. లేఖ చూసిన తర్వాత విచారణ కమిషన్ ఛైర్మన్ మనసు మార్చుకుంటారని భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# కేసీఆర్ ఫ్యామిలీ మొత్తానికి 4 ఉద్యోగాలు

- సీఎం రేవంత్ ఒక్కడికే 4 శాఖలు
- బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ



**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా మోసం చేసిందని బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి విమర్శించారు. నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్‌ను గాంధీ ఆసుపత్రిలో శనివారం ఆమె పరామర్శించారు. తెలంగాణలో జాబ్ క్యాలెండర్ విడుదల కోసం గత కొన్ని రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని భరోసా ఇచ్చి, దీక్ష విరమించాలని కోరారు. కల్వకుంట్ల కుటుంబం నాలుగు ఉద్యోగాలు తీసుకుంటే రేవంత్ రెడ్డి ఒక్కడే నాలుగు శాఖల మంత్రిగా నాలుగు ఉద్యోగాలు తీసుకుని నిరుద్యోగులను మాత్రం నిండా ముంచుతున్నరని ధ్వజమెత్తారు. అమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు ఏదైనా హాని జరిగితే దానికి కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఒక్కరు అలిగితే అయిదుగురు మంత్రులు వెళ్లారు. ఒక నిరుద్యోగి అమరణ దీక్ష చేస్తుంటే ఒక్క కాంగ్రెస్ నాయకుడు ఎందుకు రాలేదని ఆమె నిలదీశారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. సెలబస్ వేరుగా ఉన్నందున పరీక్షకు పరీక్షకు మధ్యన కనీసం 40 రోజుల సమయం ఉండేట్టు చూడాలని, జీవో 46ను రద్దు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.



# బ్యాంకు ఉద్యోగికి వీడ్కోలు

**విశ్వంభర, డిండి :** డిండి మండలంలో స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ జక్క యుగెంధర్ ఉద్యోగరీత్యా బదిలీపై కడ్తాల బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిండిలో నేను మొదటి పోస్టింగ్ అని ఇక్కడ ఖాతాదా రులకు నేను చేసిన సేవ మరువలేనిదన్నారు. బ్యాంకు మిత్రులు వీడుకోలు పలుకుతూ బ్యాంకు మిత్ర అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఫీల్డ్ ఆఫీసర్‌గా యుగేందర్ ఖాతాదారులకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ శరత్, పీ అనిల్, చెన్నయ్య, శంకరాచారి, డీజే మల్లేష్, సాయిబాబు, కేశవ్, అంజి పాల్గొన్నారు.

# మల్లారెడ్డికి ఎదురుదెబ్బ

## నెగ్గిన అవిశ్వాసం

**విశ్వంభర, మేడిపల్లి :** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ఎదురు దెబ్బ తగిలింది. టీఆర్ఎస్‌కు చెందిన బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్లపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవి గౌడ్ పదవీచ్యుతులయ్యారు. 28 మంది కార్పొరేటర్లలో 28 మంది కార్పొరేటర్లు మేయర్, డిప్యూటీ మేయర్కు వ్యతిరేకంగా ఓటు వేశారు.




# కస్తూర్బా పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలి

## ఏబీవీపీ నిరసన దీక్ష

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్యామ శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యి 20 రోజులు కావస్తున్నా.. ఇంకా కస్తూర్భా పాఠశాలలో తరగతులను ప్రారంభించలేదని, కొత్త భవనం నిర్మించినా ఇంకా ప్రారంభించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎంపీ, మరియు అధికారులు విద్యార్థులను పట్టించుకోవడం లేదని, పాత భవనంలో సరైన వసతులు లేక నిరుపేద విద్యార్థినులు విద్యకు దూరం అయ్యి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 350 విద్యార్థినులు ఉన్న పాఠశాలలో ఇంకా తరగతులను ప్రారంభించక పోవడం చాలా బాధాకరమన్నారు. వెంటనే కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని ప్రారంభించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ నెంబర్ మహేష్, భగీరథ మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్, మల్లేష్, పవన్, మధు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు

- ప్రభుత్వ భవనాలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ
- 1575 ఎకరాల ప్రాంతాన్ని సీఆర్డీఏ నోటిఫై



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి కేంద్రంగా కార్యకలాపాలు స్పీడందుకున్నాయి. తాజాగా అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను నోటిఫై చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు నిర్మించనున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సీఆర్డీఏ 1575 ఎకరాల ప్రాంతాన్ని నోటిఫై చేసింది. సీఆర్డీఏ చట్టం సెక్షన్ 39 ప్రకారం జోనింగ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేసి బహిరంగ ప్రకటన జారీ చేసింది. ప్రభుత్వ భవనాల కోసం రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం గ్రామాల్లో ఉన్న ప్రాంతాన్ని నోటిఫై చేస్తూ సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ భూముల్లో పూర్తి స్థాయి అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల నివాస సముదాయాలు నిర్మించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చంద్రబాబు రాజధాని ప్రాంతంలో పర్యటించి, పనులు ఎక్కడెక్కడ ఆగిపోయాయో పరిశీలించారు. ఆ మేరకు యాక్షన్ ప్లాన్ రూపొందించి అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించాలని సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలను మొదలుపెట్టేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు సీఆర్డీఏకు నూతన కమిషనర్‌ను నియమించింది. అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, ఎండీగా రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీ పార్థసారథిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీ పార్థసారథి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడీసీ సీఎండీగా విధులు నిర్వర్తించారు. రాజధాని మాస్టర్ ప్లాన్ సహా అమరావతి అభివృద్ధిపై ఆమెకు అవగాహన ఉంది.

దీంతో మరోసారి ఆమెను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, ఎండీగా ప్రభుత్వం నియమించింది. అమరావతి నిర్మాణంలో లక్ష్మీ పార్థసారథి సేవల్ని వినియోగించుకునే దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# కేఆర్ఎంబీ చైర్మన్‌గా అతుల్ జైన్

## నియమించిన కేంద్ర జలశక్తి .. ఉత్తర్వులు జారీ




**విశ్వంభర, ఢిల్లీ:** కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌గా అతుల్ జైన్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర జలశక్తిశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న కేఆర్ఎంబీ ఛైర్మన్ శివనందన్‌కుమార్ ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో అతుల్ జైన్‌ను ఛైర్మన్‌గా కేంద్రం నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది .కాళేశ్వరం విచారణ గడువు పొడిగింపు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన విశ్రాంత న్యాయమూర్తి పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైన్, నిర్మాణం లోపాలు, కాంట్రాక్టుల అప్పగింత తదితర అంశాలపై విచారణ చేసి వందరోజుల్లో నివేదికను అందజేయాలని నిర్దేశిస్తూ మార్చి14న ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. మార్గదర్శకాలను జారీ చేసింది.
నిర్దేశిత గడువు ఇటీవలనే ముగిసిపోయింది. మరోవైపు విచారణ కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో కమిషన్ గడువును ప్రభుత్వం పొడగించింది. జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 తేదీలోగా విచారణ నివేదికను అందజేయాలని కమిషన్‌కు సూచించింది. కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టీస్ పీసీ ఘోష్ 5న తేదీన తిరిగి రాష్ట్రానికి విచారణను ప్రారంభించనున్నారు.



# లిక్కర్ కేసులో అప్రూవర్‌గా మారేందుకు కవిత రెడీ

- అప్రూవర్‌గా మారకుండా కేసీఆర్ ప్లాన్
- యెన్నం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ కవిత అప్రూవర్‌గా మారేందుకు సిద్ధంగా ఉన్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సంచలన కామెంట్ చేశారు. కానీ కవిత అప్రూవర్‌గా మారకుండా ఉండడానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రయత్నాలు మొదలు పెట్టారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆయన రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో సంచలనంగా మారిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై జ్యూడీషియల్ ఖైదీగా తీహార్ జైలులో ఉన్నారు. 100 రోజులకు పైగానే ఆమె జైలులో ఉంటున్నారు. కవిత అటు రౌస్ అవెన్యూ కోర్టులోనూ బెయిల్ దొరకలేదని, ఇటు ఢిల్లీ హైకోర్టులోనూ దొరకట్లేదు. రిమాండ్ గడువును న్యాయస్థానం పొడిగిస్తూ వస్తోంది. తాజాగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టులు కూలిపోతున్నాయని, వాటి కోసం తెచ్చిన అప్పులు మాత్రం కట్టాల్సి వస్తోందన్నారు. భూస్వాములకు, రియల్టర్లకు రైతుబంధు నిలిపేస్తున్న దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పదేళ్లుగా పేరుకుపోయిన సమస్యలను రేవంత్ రెడ్డి పరిష్కరిస్తున్నారన్నారు. నిరంతరం ప్రజల కోసం తపనపడుతున్నాడని తెలిపారు. పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో కేసీఆర్ పరిష్కరించలేని భూసమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దగ్గరికి వెళ్లేందుకు కేసీఆర్ భయపడితే.. రేవంత్ రెడ్డి మాత్రం ధైర్యంగా వెళ్లి రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. మిషన్ భగీరథకు రూ. 50 వేల కోట్లు ఖర్చు పెట్టారని, అందులో మొత్తం అవినీతి, అక్రమాలేనని ఆరోపించారు. నిర్మాణాత్మ క ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ.. అసెంబ్లీకి కేసీఆర్ రావాలంటూ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# సీబీడీటీ ఛైర్మన్‌గా రవి అగర్వాల్

**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్‌గా రవి అగర్వాల్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. రవి అగర్వాల్ 1988 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి. 2023 జూలై నుంచి సీబీడీటీ (అడ్మినిస్ట్రేషన్) సభ్యుడిగా ఆయన వ్యవహరిస్తున్నారు. జూలై 1న బాధ్యతలు రవి అగర్వాల్ స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 30తో రవి అగర్వాల్ పదవీ కాలం ముగియనుంది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 2025 జూన్ 30 వరకు రవి అగర్వాల్ పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉంది. 2022 సంవత్సరం జూన్ నుంచి సీబీడీటీ ఛైర్మన్‌గా నితిన్ గుప్తా ఉన్నారు. ఆయన 1986 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి. 2023 సంవత్సరం సెప్టెంబర్ 30తోనే నితిన్ పదవీ కాలం ముగిసినా.. 2024 జూన్ 30 వరకూ పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది. ఇప్పుడు ఆయన స్థానంలో రవి అగర్వాల్‌ను ప్రభుత్వం నియమించింది.



### గంగపుత్ర మహిళా మత్స్య పారిశ్రామిక సంఘ

## భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి**

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణ పురం గంగపుత్ర మహిళ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షురాలు బొమ్మరబోయిన రాధ ఆధ్వర్యంలో శనివారం మునుగోడు శాసనస భ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి గ్రామంలో మహిళ మత్స్య పారిశ్రామిక నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అదేవిధంగా గంగాభవాని దేవాలయం దగ్గర ట్రాన్స్ ఫార్మర్ కూడా ఏర్పాటు చేయాలని వినతిపత్రాన్ని స మర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుత్త ఉమా ప్రేమ్ చంద్ రెడ్డి, జడ్పిటిసి వీరమళ్ల బానుమతి వెంకటేష్ గౌడ్, మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, ఉప్పల లింగస్వామి, అక్బర్ అలీ, రాసమల్ల యాదయ్య, జక్కిడి చంద్రరెడ్డి, గంగపుత్ర సంఘ మహిళ మత్స్య పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షురాలు గంగన బోయిన సతమ్మ, కార్యదర్శి భవాని, కార్యవర్గ సభ్యులు, గంగపుత్ర సంఘ మహిళ మత్స్య పారిశ్రామిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా హైదరాబాద్ రియలైజేషన్ టూర్

**విశ్వంభర, బషీర్ బాగ్ :** తెలంగాణలో ఉన్న ప్రతీ మనిషికి సహజ యోగ ద్వారా వచ్చే ప్రశాంత తను, ఆనందాన్ని అందించటానికి గత మూడు రోజులుగా హైదరాబాద్ రియలైజేషన్ టూర్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. శనివారం కాచిగూడ నుంచి నిజాం కాలేజ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సహజ యోగ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గౌరు కృష్ణ మాట్లాడుతూ సహజయోగ ద్వారా వచ్చే అన్ని రకాల ప్రయో జనాలను వివరించారు. యోగ అనేది ఒక రకమైన వ్యాయామం కాదు. రాజ యోగాన్ని అన్ని ఆధ్యాత్మిక మార్గాల్లోనూ గొప్పదిగానూ, యోగాన్ని శాస్త్రీయంగా సాధన చేసే యోగి ఏ ఇతర ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించేవారి కన్నా కూడా శ్రేష్టుడని పేర్కొన్న శ్రీకృష్ణుడి వాక్కును పరమహంస యోగానంద కూడా పునరుద్ఘాటించారని ఆయన తెలిపారు. నిజమైన యోగి అంతరి క అనుశ్రుతి సాధించే వరకు ధ్యానం చేస్తాడని తెలిపారు. కార్యక్రమం లో సుబ్బిరెడ్డి, రామ్మోహన్ రావు, మల్లారెడ్డి, సుప్రజ, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.




## మలబార్ అండ్ డైమండ్స్ లో 'నువ' కలెక్షన్

**విశ్వంభర, ఎల్బీనగర్ :** చైతన్యపురిలోని మలబార్ అండ్ డైమండ్స్ షోరూంలో నూతనంగా నువ డైమండ్ కలెక్షన్ను శనివారం వినియోగదారు ల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భం గా షోరూం హెడే రతీష్ కుమార్ మాట్లాడు తూ.. మలబార్ అండ్ గోల్డ్ డైమండ్ షోరూం నువ పేరుతో సరికొత్త వజ్రాభరణాల సేకరణ ను మార్కెట్లోకి తీసుకురావడం జరిగింద న్నారు. భారతదేశంలోని అన్ని షో రూమ్లలో ఈ కలెక్షన్ అందుబాటులో ఉంటుందన్నారు. 13 దేశాల్లో 350 షో రూం లలో బలమైన నెట్వర్క్ తో విస్తరించి ప్రపంచవ్యాప్తంగా ఆరవ అతిపెద్ద జ్యువెలరీ రిటైల్ గా ఉందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత అనేది ఒక ప్రాథమిక నిబద్ధతగా పాటిస్తూ సంస్థ యొక్క ప్రాధాన్య వ్యాపార కాలాపాలలో పర్యావరణ సామాజిక పాలన సూత్రాలను సమగ్రంగా అమలుపరస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సృజనా రెడ్డి మార్కెటింగ్ మేనేజర్ యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దళిత మైనర్పై దాడికి

## పాల్పడినపై చర్యలు తీసుకోవాలి

**బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్**

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇటీవల జూన్ 22న హైదరాబాద్ శివారులోనీ రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం కేసారం గ్రామానికి చెందిన 14 ఏళ్ల దళిత బాలుడు ఒక ఇంటి కాంపౌండ్ వాల్ ఎక్కి ఆ ఇంట్లోని చెట్టుకున్న దానిమ్మ పం డు కోశాడు. అది గమనించిన ఆ ఇంటి యా జమాని బాలుడిని పట్టుకొని చేతులు కాళ్ళు తాడుతో కట్టేసి నేలపై పడేసి కొట్టడం దారు- ణమని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ఆ ఇంటి యజమాని మధుసూదన్ రెడ్డి రిటైర్డ్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు. పిల్లలకు పాఠాలు చెబుతూ విద్యా బుద్ధులు నేర్పించే గురువు. బాలుడు చేసిన చిన్న తప్పుకు అతన్ని పట్టుకుని చేతులు, కా ళ్ళు తాడుతో కట్టేసి నేలపై పడేసి పాశవికంగా కొట్టడం అనాగారికమైన చర్య అని అతన్ని చట్టపరంగా శిక్షించాలని, బాలల హక్కుల సంక్షేమ సంఘం (బి హెచ్ ఎస్ ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ డిమాండ్ చేశారు. పది రూపాయలు విలువ చేసే పండు కోసం ఏకంగా బాలుడిని కట్టేసి చితక్కొట్టారని



మండిపడ్డారు. ఈ విషయాన్నీ బాధిత బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటి కీ సకాలములో పోలీసులు స్పందించలేద న్నారు. దళిత మైనర్ బాలుడిని కొట్టడం నేరమని వెంటనే అతనిపై బాలల హక్కుల రక్షణ చట్టం ప్రకారం కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# రాజకీయ ప్రతీకారానికి బీజేపీ

**• కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుంది • ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**

**విశ్వంభర, బషీర్బాగ్ :** దేశంలో తిరుగులేని రాజకీయ శక్తిగా వేగంగా ఎదుగుతూ ప్రధాని మోదీ నియంతృత్వంపై అవిశ్రాంత యుద్ధం చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్పై రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి బీజేపీ అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ జైళ్లకు పంపుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మండిపడ్డారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ అరెస్ట్ చేసి జైలుకు పంపగా, ట్రయల్ కోర్ట్ నుంచి జూన్ 20న బెయిల్ లభించిందని, మరుసటిరోజే సీబీఐ అరెస్ట్ చేయడం, బెయిల్కు వ్యతరేకంగా ఈడీ సుప్రీం కోర్ట్ నుంచి స్టే తీసుకురావడం అన్ని చూస్తే, అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటికి రాకుండా చూసేందుకు బీజేపీ ఈడీ, సిబిఐలను ఎంత దుర్వినియోగం చేస్తుందో దేశ ప్రజలు గమనిస్తున్నారని, అరవింద్ కేజ్రీవాల్ అంటే ప్రధాని మోదీకి భయం పట్టుకుందని అయన తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ను సీబీఐ అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోనళల్లో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ హైదరాబాద్, నాంపల్లి, బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించింది. అనంతరం డాక్టర్ దిడ్డి సుధాకర్ తోసహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు పూర్తి మెజారిటీ రాకుండా చేసి తిరస్కరించినా, అడ్డదారిన కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి మళ్లీ నిరంకుశత్వం వైపు పయనిస్తూ ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకొని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని నాశనం




చేస్తుందని అయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఎండీ మజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, య- ువజన విభాగం అధ్యక్షులు విజయ్ మల్లంగి, అధికార ప్రతినిధులు ఆఫస సలాం, డా. లక్ష్య నాయుడు, జావీద్ షరీఫ్, నేతలు జైసింగ్ జాదవ్, కొడంగల్ శ్రీనివాస్, శివాజీ, సలావుద్దీన్, దర్శనం రమేష్, సోము రమేష్, కుత్బుద్దీన్, సలీమ్, పవార్ తదితరులు పాల్గొన్నారు.

### సికింద్రాబాద్ ఎంసీఈఎంఈలో

## ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు

**విశ్వంభర, హైదరాబాద్ :** సికింద్రాబాద్లోని మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్లో 105వ కాన్వొకేషన్ వేడుక జరిగింది. రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ రమేష్ కంచర్ల అధ్యక్షతన 22 మంది టీఈఎస్-41 కోర్స్ అధికారులు కాన్వొకేషన్ వేడుకలు నిర్వహించారు. రాయల్ భూటాన్ ఆర్మీకి చెందిన ముగ్గురు అధికారులు మరియు శ్రీలంక ఆర్మీకి చెందిన ఇద్దరు అధికారులతో సహా జేఎన్యూ యొక్క ప్రతిష్టాత్మకమైన డిగ్రీలు పొందారు. లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే, వీఎస్ఎం, కమాండెంట్ మరియు కల్నల్ కమాండెంట్ల స్ఫూర్తిదాయక ప్రసంగంతో ఈవెంట్ ప్రారంభమైంది, వారు ప్రత్యేకమైన మైలురాయిని సాధించినందుకు యువ అధికారులను అభినందిస్తూ.. సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంలో సాంకేతికతను స్వీకరించాలని వారిని ప్రోత్సహించారు. భారత సైన్యం యొక్క ఆధునీకరణ ప్రయత్నాలు మరియు వ్యూహాత్మక సైనిక అనువర్తనాలతో సముచిత సాంకేతిక పురోగతిని ఏకీకృతం చేయడానికి ప్రయత్నించాలని వారిని కోరారు. టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ శారీరకంగా చురుకైన, మానసికంగా దృఢమైన మరియు ఆధునిక రక్షణ సాంకేతికత యొక్క సంక్లిష్టతలను అధిగమించడానికి మరియు జాతీయ భద్రతకు దోహదపడే శిక్షణ పొందిన అత్యంత శిక్షణ పొందిన సాంకేతిక అధికారులను భారత సైన్యంలోకి చేర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. గత నాలుగేళ్లలో ఈ 22 మంది అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్ర సైనిక శిక్షణతో మిళితం చేసి, వారిని 'టెక్నో వారియర్'గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఒక కఠినమైన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ ఎంసీఈఎంఈలో



అత్యుత్తమ శిక్షణా ప్రమాణాలు ఉన్నాయని, సమకాలీన యుద్ధంలో రాణించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధునిక రక్షణ సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను సమకూర్చడంలో వారి కఠినమైన శిక్షణ యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు. అత్యాధునిక పరిజ్ఞానం మరియు సాంకేతిక నైపుణ్యంతో ఆయుధాలు కలిగి ఉన్న ఈ యువ అధికారులు జాతీయ భద్రతకు గణనీయమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉ న్నారని కూడా ఆయన చెప్పారు. GOC-in-C ARTRAC ట్రోఫీ మరియు ఉత్తమ ఆల్ రౌండ్ విద్యార్థి అధికారికి పుస్తక బహుమతి మరియు మొత్తం మెరిట్ క్రమంలో మొదటి స్థానంలో నిలిచినందుకు DGEME గోల్డ్ మెడల్ లెఫ్టినెంట్ థోరట్ సందేశ్ సంజయ్కు లభించింది. భారత సైన్యం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లకు ప్రతి ప్రాజెక్ట్ వినూత్న పరిష్కారాలను అందిస్తూ, ఇంజనీరింగ్లోని సముచిత డొమైన్లలో యువ అధికారుల ప్రాజెక్ట్ ప్రదర్శనతో కాన్వొకేషన్ వేడుక ముగిసింది.



## పరిశుభ్రత పాటించాలి

**విశ్వంభర, మెట్పల్లి :** మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ శనివారం పలు వార్డులలో పారిశుద్ధ్య పనులను, పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున మురికి కాలువలు ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని, వార్డుల్లో చెత్త లేకుండా చూడాలని ఎక్కడైనా వర్షం నీరు ఆగినచో ఆయిల్ బాల్స్ వేయాలని సిబ్బందికి ఆదేశించారు. సీజనల్ వ్యాధు లు ప్రబలించకుండా ప్రజలు ఇండ్లలోఉన్న కూలర్స్ , కుండీలలో, డ్రమ్ములలో, పాత టైర్లలో నిల్వ ఉ న్న నీరును ఎప్పటికప్పుడు తొలగించాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని క్రిమి కీట కాలు ఇంట్లోకి ప్రవేశపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటోల ద్వారా వచ్చే పొడి చెత్త ను పొడి వనరుల సేకరణ కేంద్రంలో ప్రతిరోజు ఇవ్వాలని ఆదేశించారు. విధులలో ఎవరైనా ని ర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్య క్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసులు ఇతరులను అగౌరవపరచొద్దు

- షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు
- సౌత్ గ్లాస్ పరిశ్రమ ఘటనలో పోలీసుల తీరుపై అసంతృప్తి
- షాద్నగర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్కు లేఖ

**విశ్వంభర, షాద్నగర్ :** నేను ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో తెలుగుదేశం పార్టీ దళిత విభాగం అధ్యక్షుడిగా మూడు ప్రాంతాలలో పర్యటించి బడుగుల భాదలు గమనించా ను.. ఏదుటి వ్యక్తిని మానసికంగా అగౌరవ పరచరాదని పోలీసుశాఖలో మార్పు రావాలని కోరుతున్నాను అంటూ తీవ్ర అసంతృప్తితో షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు షాద్నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కి లేఖ పంపుతున్నట్టు మీడియాకు తెలిపారు. నిన్న జరిగిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆవేదనకు గురయ్యారు. షాద్నగర్ నియోజకవర్గం ఫరుఖ్ నగర్ మండలం చింతగూడేం గ్రామ పంచాయతీ పరిధిలో "సౌత్ గ్లాస్ ప్రయివేట్ లిమిటెడ్" అద్దాల తయా రి పరిశ్రమలో రియాక్టర్ పేలి పలువురు కార్మికులు చనిపోయారని సమాచారం రావడంతో బక్కని నర్సింహు లు స్వయంగా పరిశ్రమ పద్దకు వెళ్లినట్లు లేఖలో పేర్కొ న్నారు. ఆయన గమనించిన విషయం లేఖలో పేర్కొం టూ.. పరిశ్రమ అవరణలో ఒక శవం పడి ఉండడం చూశాను. లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు




డీసీపీ వస్తున్నారు. ప్రస్తుతం లోపలికి వేళ్లడం కుదరదని తెలపగా నేను మరియు పత్రికల వారు గేటు సమీపంలో నిలబడి ఉండగా నందిగాం ఎస్ఐ గోపాలక్రిష్ణ ముందు బయటికి వేళ్లండి అని తెలుపగా అతను కలెక్టర్ వస్తున్నారు అన్నట్టు పేర్కొన్నారు. బయటకు పోండి అనగా నేను ఆయన గారిని ఆయ్యా. మేము ఇక్కడ శాంతికి భగ్నం కలిగించలేదు. ఎందుకు బయటకు వేళ్లాలి కారణం చెప్పాలని అడిగి చివరకు నేను బయటకు వేళ్లి పోయాను. నేను రాత్రి అక్కడ నుంచి వేళ్లి పోయాననీ ఈ విషయం స్థానిక అధికారి ఏసీపీ అయినందున మీకు సమయం ఉ దయం 10:50 లకు పోన్ చేసి నమస్కారం ఏసీపీ పరిశ్రమలో ఎంతమంది చనిపోయారు అని అడగగా మీరు ఐదు (5) మంది బదులిచ్చారనీ, నేను తిరిగి సార్ బయట పది మంది అని అంటున్నారు అని అడుగగా మీరు ఒకవేళ అలాంటిది ఉంటే శవాలు ఉండాలి కదా అని అనగా నేను పరిశ్రమలో కార్మికుల వేతనాలు రిజిష్టరు చేసి ఉంచడం లేదని అనగా మీరు ఇండస్ట్రీ వారు చూసుకుంటారు అనగా నేను మీతో సమస్య గురించే తెలుపుతున్నాను అన్నట్టు ఇద్దరి మధ్య జరిగిన సమాధానం గురించి లేఖలో ప్రస్తావించారు. అనగా నేను పంచనామా చేస్తున్నాను సాయంత్రం అయితే ఒక గంట మాట్లాడుతాను అని ఏసీపీ అన్నారని, నేను కాల్ చేసినప్పుడు మోదట్లోనే బిజీగా ఉన్నాను అంటే నేను మాట్లాడే వాడిని కాదు క్షమించాలి.. అని నేను రేండు పర్యాయాలు తెలుపగా నాతో వాగ్వాదం చేస్తున్నావని ఆవేశంతో ఫోన్ పెట్టేశారని లేఖలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పార్లమెంట్ సాంప్రధాయల మేరకు అవమానకరంగా భావిస్తున్నాను అని బక్కని నరసింహులు తన ఆవేదన పత్రంలో పేర్కొన్నారు. ఒక సబ్ ఇన్స్పెక్టర్ బయటకు వెళ్లమంటే ఒక ఉన్నతాధికారి ఫోన్ పెట్టి అవమాన పరుస్తారని, ఒక మాజీ శాసన సభ్యుడు ఒక పార్టీ నాయకుని పరిస్థితి ఈ విధంగా ఉంటే సామాన్యుల బ్రతుకు ఏలా ఉంటుందో ఉహించలేమని లేఖలో పేర్కొన్నారు. తనకు గత అనుభవాలు జ్ఞాపకం వస్తున్నాయని 1972 సంవత్సరంలో మా గ్రామ పోలీస్ పటేలు పట్వారిలు కలిసి మా తండ్రిని చెట్టుకు కట్టేసీ కోట్టగా నేను విద్యార్థి దశలో నా కండ్లారా చూశాను. తను నాయకుడిగా అయ్యాక ఉమ్మడి రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు దళిత విభాగంలో పనిచేశానని లేఖలో ప్రస్తావించారు. ఎదుటివారిని అగౌరవ పరచకూడదని ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. మీడియాతో పాటు ఈ లేఖను సైబరాబాద్ కమిషనర్కు పంపించారు.



## డీఎస్‌కు ఎంపీ వద్దిరాజు ఘన నివాళి

**విశ్వంభర, హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం మాజీ మంత్రి, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఎంపీ రవిచంద్ర బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని డీఎస్ నివాసానికి శనివారం మధ్యాహ్నం తన సన్నిహితులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ఏనుగు రాజేందర్, ఆది విష్ణుమూర్తి, ఆకుల రజిత్, మరికల్ పోత సుధీర్ కుమార్, ఊసా రఘులతో కలిసి వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులతో కలిసి డీఎస్ కుమారులు సంజయ్, అరవింద్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత నాయకుని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.



## ఎమ్మెల్యేకు టీయూడబ్ల్యూజే సన్మానం

**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌ను విలేకరులు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సన్మానించారు. ఎమ్మెల్యే తో పాటుగా ఎంపీపీ మాధవరం సునీత, జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, తహసిల్దార్ తిరుపతయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అవుట మల్లేష్, చిర్ర వెంకట్ రెడ్డి, మహమ్మద్ ఖయ్యూమ్, కాసుల ఐలేష్ చారి, దుబ్బ శ్రీనివాస్ రెడ్డి, కాంపల్లి హుస్సేన్, బుషిపాక చంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి

### ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతి

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)కు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మోడల్ స్కూల్ సిబ్బంది పేర్కొంది. మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ నుంచి మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌కి వినతి పత్రం అందజేయగా, వారు ఈ విషయంపై వెంటనే సానుకూలంగా స్పందించి, ఈ మార్గంలో బస్సును ఉదయం 8 గంటలకు కుర్మేడ్ ఎక్స్ రోడ్ నుంచి, కుర్మపల్లి, సాయి రెడ్డిగూడెం, మల్లెపల్లి, పీకే మల్లెపల్లి, కిష్టరాయినిపల్లి, నరసింహాపురం, రాయినిగూ డెం, వర్కాల, చింతపల్లి ఎక్స్ రోడ్, మోడల్ స్కూల్ వరకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రైస్సున్నిసాబేగం, శ్రీనివాస్, వెంకన్న, గౌతం బాబు, సునీల్, విజయ్ కుమార్, భార్గవ్ పాల్గొన్నారు.

## పెండింగులోని స్కాలర్ షిప్స్‌ను విడుదల చేయాలి



**విశ్వంభర, దేవరకొండ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 7 వేల కోట్ల రూపాయల పైచిలుకు స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయకు ఏఐఎస్ఎఫ్ సభ్యులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణలు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గలో వున్నా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేటు పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని అన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ సహాయ కార్యదర్శి ఎనిమల్ల సాయి, నాయకులు కొర్ర రాంబాబు, టి నాగేందర్, ఎన్ రాంబాబు, ఆర్ పవన్, ఆర్ శివ, రమేష్, లక్ష్మణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టంతోనే లక్ష్య సాధన

### అంతర్జాతీయ బాస్కెట్ బాల్ ఆటగాడు సల్లా ప్రసాద్



**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్పోర్ట్స్ అకాడమీ 2023-24 సం.కు సంబంధించి శనివారం పాఠశాల ప్రాంగణంలో ప్రశంసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహించిన అంతర్జాతీయ బాస్కెట్ బాల్ ఆటగాడు సల్లా ప్రసాద్, సందీప్ గౌడ్, ఒమన్ క్రికెటర్ 3 సార్లు ప్రపంచకప్ టీమ్ ప్లేయర్, సందీప్ భావంక, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఇండియా ఏ, హైదరాబాద్ రంజీ ప్లేయర్ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సల్లా ప్రసాద్ మాట్లాడుతూ కష్టపడితేనే లక్ష్యాలను చేరుకునేలా చేస్తుందన్నారు. ముఖ్య అతిథులు క్రీడాకారులందరి విజయాలను, కృషిని గుర్తించి పతకాలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ రామాంజుల, ప్రిన్సిపాల్ ఫహ్మీదా, సిహెచ్ రేఖారావు, ఫాతిమా కాజిమ్, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ పాల్గొన్నారు.

### రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నంతో

## ఎమ్మెల్యే గణేష్, సతీష్ గుప్త భేటీ



**విశ్వంభర, హైదరాబాద్ :** ఎమ్మెల్యే గణేష్ సహకారంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ప్రముఖ సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త, ఉప్పలంచ అమర్నాథ్, మాజేటి రాజేష్, రాము తదితరులు శనివారం భేటీ అయ్యారు. రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ వలన వేలాది మంది వారి ఆస్తినష్టం, జీవనోపాధి కోల్పోతున్నారని, కనక 200 ఫీట్లుకు బదులుగా 100 ఫీట్లకు తగ్గించాలని, నష్ట పోతున్న వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్ట పరిహారం చెల్లించాలని బాధితులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందచేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## బీఎన్‌రెడ్డినగర్ అభివృద్ధికి సహకరించాలి

### కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

**విశ్వంభర, హయత్‌నగర్ :** జీహెచ్ఎంసీ హయత్ నగర్ సర్కిల్ క్యాంపు కార్యాలయంలో శనివారం డిప్యూటీ కమిషనర్ టీ యాదయ్య ఆధ్వర్యంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై మాట్లాడుతూ తమ డివిజన్ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించాలని కోరారు. ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, యూబీడీ సెక్షన్, వెటర్నరీ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారు అభివృద్ధికి సహకరించాలని కోరారు. డివిజన్ శివారులో నూతన కాలనీలకు మౌలిక వసతులను కల్పించాలని, లోతట్టు ప్రాంతాలు చిన్నపాటి వర్షానికి రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఇబ్బందికరంగా మారుతుందని సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, జిహెచ్ఎంసి ఈఈ సురేష్ బాబు, డీఈ దామోదర్ రావు, ఏసీపీ పావని, టీపీఎస్ మాన్సూర్, డీఈ లావణ్య, వెటర్నరీ ఆఫీసర్ యాదగిరి, శానిటేషన్ ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## సంపూర్ణ ఎదుగుదలకు యోగా ఎంతో ముఖ్యం

### వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య

**విశ్వంభర, హైదరాబాద్ :** సంపూర్ణ ఎదుగుదలకు యోగ ఎంతో ముఖ్యం ముఖ్యమని సహజ యోగా నేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య, సహజ యోగ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ లు అన్నారు. హైదరాబాద్ రియలైజేషన్ టూర్ పేరుతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సహజ యోగ మహోత్సవ కార్యక్రమానికి సోనాలి భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగ ఒక వ్యక్తిగత జీవనశక్తిని విశ్వంతో అనుసంధానం చేయడానికి ఉపయోగపడే సాధనమని అన్నారు. మనలో ఏకత్వం, పూర్ణత్వం అనుభూతి చెందినప్పుడు కూడా యోగా అని అనవచ్చని తెలిపారు. యువత అంటేనే బోలెడు శక్తి అని యువత కూడా యోగాన్ని నేర్చుకుంటున్నారని తెలిపారు. ప్రపంచంలో ప్రభలంగా వ్యాప్తిస్తున్న ఆందోళన, అభద్రతాభావము, కుంగు బాటులు లాంటి సమస్యలు అయినా యోగా ద్వారా పరిష్కారం చేసుకొని ఆ సంపూర్ణ జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. యోగ మనందరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ నటులు, మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ మెంబర్స్ సుప్రజ, వినోద్, ప్రమోద్, సభ్యులు సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పల్లకీ సేవ

**విశ్వంభర, షాద్‌నగర్ :** మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతి శర్మ, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## జూలై 1న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

**విశ్వంభర, ఆత్మకూరు (ఎం) :** జూలై 1న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం పీఏసీఎస్ అధ్యక్షుడు జిల్లాల శేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీఏసీఎస్ సభ్యులు ప్రతేక సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు. అజెండా అంశం రైతు బందు గురించి సలహాలు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

## 3న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 03న నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యుడి పదవి కాలం ముగింపు సందర్భంగా వారి అందరికీ ఘనంగా వీడ్కోలు సన్మానం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నందున ఎంపీటీసీ జడ్పీటీసీ సభ్యులు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు సమయానికి హాజరై ఈ వీడ్కోలు సన్మానోత్సవం సమావేశమును విజయవంతం చేయాలని ఎంపీపీ మంగమ్మ కోరారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ పక్షోత్సవాలు

**విశ్వంభర, ఆత్మకూరు (ఎం) :** జన సంఘ్ వ్యవస్థాపకుడు, కాశ్మీర్ 370 ఆర్టికల్‌ను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న, ఏక్ దేశ్మే దో ప్రధాన్, దో నిషాన్ నహీ ఛలేగా అనే నినాదంతో పోరాడిన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ జూన్ 23 నుంచి వారి వర్ధంతి జూలై 6 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పక్షోత్సవల్లో భాగంగా "ఏక్ పెడ్ మా కే నామ్" శనివారం రోజు బీజేపీ రాష్ట్ర నాయకులు తుమ్మల మురళీధర్ రెడ్డి తల్లిదండ్రులు సుజాత, నర్సిరెడ్డిలతో కలిసి ఆత్మకూరు(ఎం)లోని వారి వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నాగం సత్తిరెడ్డి, తిమ్మాపూరం గ్రామ పంచాయతీ తాజా మాజీ వార్డు మెంబర్ తోటకూరి సంధ్య మల్లేష్ యాదవ్, తోటకూరి కల్పన, తోల్పునూరి వాణి, దేవరాజు ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## వనమహోత్సవనాకి ఏర్పాట్లు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో త్వరలో ప్రారంభం కానున్న వనమహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని కాలనీల్లో, గ్రామీణ క్రీడా మైదానంలలో, బంజర్భూములలో, చెరువులు, కుంట కట్టలపైన, గ్రామీణా రహదారులకు ఇరువైపులా చెట్లను నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీసే పనులు చేపడుతున్నారు. ఆయా గ్రామాలలో ఈజీఎస్ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాలలో కొనసాగుతున్న వనమహోత్సవం కార్యక్రమానికి చేపట్టవలసిన పనులను ఈజీఎస్ ఏపీఓ బోడిగే రమేష్ శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే మొక్కలు నాటటం జరుగుతుంది అని అన్నారు. వీరితోపాటు టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



# కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ!

## 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధింపు

**విశ్వంభర,ఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి,ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఇటీవల ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తీహార్ జైలు నుంచి అర్వింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ.. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చింది. దాంతో కోర్టు మూడు రోజుల సీబీఐ రిమాండ్ విధించింది. నిన్నటితో మూడు రోజుల సీబీఐ రిమాండ్ ముగియడంతో అధికారులు మరోసారి కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చారు. విచారణ కోసం కేజ్రీవాల్‌ను రెండు వారాల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరారు. దాంతో కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జూలై 12 వరకు కేజ్రీ రిమాండ్ కొనసాగనుంది. కాగా ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేజ్రీవాల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 19న అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈడీ కస్టడీలోనే తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను అదే కేసులో నాలుగు రోజుల క్రితం సీబీఐ అరెస్ట్ చేసింది.

కేసుకు సంబంధించిన పలు వివరాలు రాబడుతోంది.

## సీఎం మమతాపై పరువునష్టం

# కేసు వేసిన గవర్నర్

- రాజ్‌భవన్‌పై ఇటీవల మమతా ఆరోపణలు
- గవర్నర్ ఆనంద్ బోస్ పరువునష్టం కేసు దాఖలు

**పశ్చిమ బెంగాల్:** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ పరువునష్టం కేసు నమోదు చేశారు. కోల్‌కతా హైకోర్టులో ఆయన ఆ పిటీషన్ ఫైల్ చేశారు. రాజ్‌భవన్‌కు వెళ్లేందుకు మహిళలు భయపడుతున్నారని ఇటీవల మమతా ఆరోపించారు. ఆ ఆరోపణలను ఖండిస్తూ గవర్నర్ ఆనంద్ బోస్ పరువునష్టం కేసు దాఖలు చేశారు. ప్రజాప్రతినిధులు తప్పుడు అభిప్రాయాలను క్రియేట్ చేయరాదు అని ఆయన అన్నారు. రాజ్‌భవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీఎంసీ నేతలపైన కూడా పరువునష్టం కేసును దాఖలు చేశారాయన. రాజ్‌భవన్‌లో గవర్నర్ బోస్ .. వేధింపులకు పాల్పడినట్లు కాంట్రాక్టు మహిళా ఉద్యోగి ఒకరు మే 2వ తేదీన ఫిర్యాదు చేశారు. ఆ కేసులో కోల్‌కతా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ అంశంపై స్పందించేందుకు టీఎంసీ రాజ్యసభ ఎంపీ డోలా సేన్ రియాక్ట్ అయ్యేందుకు నిరాకరించారు. అసలు ఏం జరిగిందన్న దానిపై పార్టీ నాయకత్వంతో చర్చించాలని, ఇది చాన్నా సున్నితమైన అంశమని సేన్ తెలిపారు. గవర్నర్ ఆనంద్ బోస్ తీసుకున్న నిర్ణయాన్ని సీనియర్ బీజేపీ నేత



రాహుల్ సిన్హా సమర్థించారు. ఆ నిర్ణయం ఎప్పుడో తీసుకోవాల్సి ఉందని అన్నారు. ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సిన్హా వెల్లడించారు. గవర్నర్ బోస్, సీఎం మమతా బెనర్జీ మధ్య జరుగుతున్న వివాదం రాష్ట్రానికి మేలు చేయడం లేదని సీపీఎం నేత సుజన్ చక్రవర్తి తెలిపారు.



# అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఖతమే

- శవపేటికలో పెట్టి, పూడ్చే సమయం ఆసన్నమైంది
- జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, జార్ఖండ్ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతుందని జార్ఖండ్ ముక్తి మోర్చ నేత,మాజీ సీఎం హేమంత్ సోరెన్ జోస్యం చెప్పారు. శనివార జార్ఖండ్ రాజధాని రాంచీలో తన పార్టీ మద్దతుదారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ సీఎం హేమంత్ సోరెన్ మాట్లాడుతూ.. తమపై కుట్ర పన్నిన వారికి తగిన విధంగా సమాధానం చెబుదామని తన మద్దతుదారులకు ఆయన పిలుపు నిచ్చారు. బీజేపీని శవపేటికలో పెట్టి.. పుడ్చి పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. తనపై కాషాయ పార్టీ కుట్రపన్నుతోందని ఆరోపించారు. మాజీ సీఎం తన నివాసంలో ముక్తి మోర్చా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. జైలులో తనని నిర్భందించడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. తనపై కుట్ర పన్నిన వారిపై తిరుగుబాటు ఉంటుందని హేమంత్ సోరెన్ పేర్కొన్నారు. బీహార్‌లో బీజేపీని సమాధి చేసే సమయం ఆసన్నమైందని సోరన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

### భూ కుంభకోణం కేసులో బెయిల్

ఇక భూకుంభకోణం అంశానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ శుక్రవారం రాంచీలోని బిర్సా ముండా జైలు నుంచి విడుదలయ్యారు. ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేయడంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసు విచారణకు సంబంధించి హేమంత్ సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి న అరెస్టు చేసింది. రాజ్యాంగ బద్ధమైన అన్ని వ్యవస్థలను బీజేపీ నియంత్రించిందని హేమంత్ సోరెన్ ఆరోపించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కాషాయ దళానికి బుద్ధి చెప్పారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముందుస్తుగా పెట్టడానికి బీజేపీ కుట్రపన్నుతోందని తెలిపారు. అందుకు ఆ పార్టీ ప్రణాళికలు రచిస్తోందన్నారు. బీజేపీ కోరుకున్న రోజున ఎన్నికలు నిర్వహించండి అంటూ హేమంత్ సోరెన్ కమలనాథులకు సవాల్ విసిరారు. వివిధ రాష్ట్రాల్లో గిరిజన నేతలను ముఖ్యమంత్రులను నియమిస్తోందని వారు రబ్బరు స్టాంప్ మాత్రమే అని ఆరోపించారు.

# యూజీసీ నెట్ ఎగ్జామ్ రీ షెడ్యూల్

- తేదీలను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 21-సెప్టెంబర్ 4 మధ్య పరీక్షలు

**విశ్వంభర, ఢిల్లీ :** దేశ వ్యాప్తంగా పేపర్ లీక్ విషయం కలకలం సృష్టించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం యూజీసీ నెట్ 2024 పరీక్షను రద్దు చేసింది. తాజాగా యూజీసీ నెట్‌కు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. ఈ పరీక్షకు సంబంధించి కొత్త తేదీలను ఎన్టీఏ విడుదల చేసింది. కొత్త షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4 మధ్య యూజీసీ నెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఎన్టీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో సీఎస్ఐఆర్ నెట్ పరీక్షను జులై 25 నుంచి 27 మధ్య నిర్వహిస్తుండగా.. ఎన్ సెట్ పరీక్షను జులై 10న నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ 2024 పరీక్ష, నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 పరీక్షలను ఆన్ లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. కాగా, గతంలో ఆఫ్ లైన్ విధానంలో పెన్ను, పేపర్ విధానంలో పరీక్షను నిర్వహించేవారు. తాజాగా, యూజీసీ



నెట్ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆల్ ఇండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ పరీక్ష 2024ను షెడ్యూల్ ప్రకారమే జులై 6న నిర్వహించనున్నారు. ఈ ఏడాది జూనియర్ రీసెర్చ్ ఫెల్లో షిప్ నకు అర్హత సాధించేందుకు..విశ్వ విద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఎన్టీఏ నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీక్ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. తర్వాత యూజీసీ నెట్‌లో అక్రమాలు జరిగాయంటూ నివేదిక రావడంతో కేంద్రం ఆ పరీక్షను రద్దు చేసింది. దేశ వ్యాప్తంగా 317 నగరాల్లోని 1,205 సెంటర్లలో పెన్ను, పేపర్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షకు 11 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరైన సంగతి తెలిసిందే ఈ పరీక్షను రెండు విడతలుగా నిర్వహించగా.. రెండిటిలో అక్రమాలు జరిగాయని నివేదిక వచ్చింది. దీంతో కేంద్ర విద్యాశాఖ పరీక్షను రద్దు చేస్తూ ప్రకటించింది.

**కొత్త షెడ్యూల్ ఇదే..**

ఎన్‌సెట్ 2024 పరీక్ష – జులై 10,
జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ 2024 పరీక్ష – జులై 25 నుంచి 27,
యూజీసీ నెట్ పరీక్ష – ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4.

# నీట్‌ను జాతీయ స్థాయిలో రద్దు చేయాలి

- ఆసక్తి ఉన్న రాష్ట్రాలు నిర్వహించుకునే చాన్స్ కల్పించాలి
- మోడీకి, ఎనిమిది రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ

**విశ్వంభర, తమిళనాడు:** వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీతో పాటు 8 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తమిళనాడు సీఎం స్టాలిన్ లేఖలు రాశారు. నీట్‌ను జాతీయ స్థాయిలో రద్దు చేయాలని, ఆసక్తి ఉన్న రాష్ట్రాలు మాత్రమే నిర్వహించుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. దీని ప్రకారం తమిళనాడును నీట్ నుంచి మినహాయించాలని ఆయన ప్రధాని మోడీని కోరారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు ఉండాలని,అప్పుడే విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని తమిళనాడు సీఎం స్టాలిన్ సూచించారు. నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నారు. దీన్ని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపినట్లు ప్రధానికి రాసిన లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ ద్వారా కాకుండా మెడికల్ అడ్మిషన్లను 12వ తరగతి మార్కుల ఆధారంగానే ఇవ్వాలని కోరారు. అలాగే ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జారండ్, కర్నాటక, కేరళ, పంజాబ్, తెలంగాణ, బెంగాల్ వంటి విపక్షాలు అధికా



రంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సైతం స్టాలిన్ వేర్వేరు లేఖలు రాశారు. ఆయా రాష్ట్రాలు తమ అసెంబ్లీలోనూ నీట్ రద్దుకు అనుకూలంగా తీర్మానాలు చేయాలని కోరారు. తమ రాష్ట్రాల్లో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నీట్ ను జాతీయ స్థాయిలో రద్దు చేయాలని కూడా సూచించారు. అలాగే లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి కూడా తమిళనాడును నీట్ నుంచి మినహాయించాలన్న డిమాండ్ కు మద్దతివ్వాలని సీఎం స్టాలిన్ కోరారు.



# మోడీకి వరలక్ష్మి శరత్ ఇన్విటేషన్

## పెళ్లికి రావాలంటూ ఆహ్వానం

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రముఖ దక్షిణాది నటి వరలక్ష్మి శరత్ కుమార్ త్వరలో పెళ్లిపీటలు ఎక్కుతున్నారు. ముంబైకి చెందిన ఆంట్రప్రెన్యూర్, ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకుడు నికొలాయ్ సచ్ దేవ్ తో ఆమె వివాహం జులైలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఆమె తన పెళ్లికి రావాలంటూ ప్రముఖులకు స్వయంగా ఆహ్వానం పలుకుతున్నారు. తాజాగా, కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వచ్చిన వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాని నరేంద్ర మోడీని కలిసి పెళ్లి కార్డు అందించారు. తన వివాహ రిసెప్షన్ కు తప్పక రావాలంటూ ఆహ్వానించారు. వరలక్ష్మితో పాటు ఆమె తండ్రి శరత్ కుమార్, రాధిక, నికోలాయ్ సచ్ దేవ్ కూడా పీఎంవోకు వచ్చి మోడీని కలిశారు. దీనిపై వరలక్ష్మి ఎక్స్ ద్వారా స్పందించారు. “మన గౌరవనీయ ప్రధాని మోదీ గారిని కలవడం ఎంతటి గొప్ప అవకాశం! ఆయనను మా వివాహ రిసెప్షన్ కు రావాలని ఆహ్వానించాం. మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించిందుకు, ఎంతో బిజీ షెడ్యూల్‌లోనూ మా కోసం సమయం కేటాయించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. నిజంగా ఇది మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం సర్. థాంక్యూ డాడీ... ప్రధాని మోదీని కలిసే అవకాశం నీ వల్లే సాధ్యమైంది” అంటూ వరలక్ష్మి శరత్ కుమార్ భావోద్వేగాలతో ట్వీట్ చేశారు. అంతేకాదు, ప్రధానిని కలిసినప్పటి ఫొటోలు కూడా పంచుకున్నారు.



## కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేయండి

- కేంద్రానికి లేఖ రాసిన పీయూసీఎల్
- దేశంలో జులై 1 తర్వాత కొత్త న్యాయ చట్టాలు

**విశ్వంభర, ఢిల్లీ:** భారతదేశంలో బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ శిక్షాస్మృతిని తొలగించి, నూతన క్రిమినల్ చట్టాలను తీసు కురావాలని కేంద్రం సన్నద్ధమవుతున్న సంగతి తెలిసిందే. జులై 1 తర్వాత దేశంలో కొత్త చట్టాలు అమలు కానున్నా యి. ఇప్పటివరకు ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భార తీయ నాగరిక్ సురక్ష (బీఎన్ఎస్‌–ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) అమలు కానున్నాయి. అయితే, నూతన క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని పీయూసీఎల్ (పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కు లేఖ రాసింది. కొత్త చట్టాల తీరుతెన్నులు, కొత్త చట్టాల అసవరం, కొత్త చట్టాలు ప్రవేశపెట్టడానికి గల అవకాశా లు తదితర అంశాలపై ముందు జాతీయ స్థాయిలో చర్చ జరగాలని పీయూసీఎల్ తన లేఖలో పేర్కొంది. ఎంతో విస్తృతంగా చర్చించి ఈ చట్టాలను తీసుకువచ్చామని తెలి పింది. సభలో చర్చల సందర్భంగా అనేకమంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశామని న్యాయ శాఖ మంత్రి ఇటీవ ల చెప్పారని... అయితే, విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయ డం ఆ చట్టాలపై వివరణాత్మక చర్చ జరగలేదన్న విషయాన్ని ఎత్తిచూపుతోందని పీయూసీఎల్ తన లేఖలో ప్రస్తావించింది. పైగా, క్రిమినల్ న్యాయవాదులు, న్యాయ వ్యవస్థలు, న్యాయాధికారులు, సాధారణ పౌరుల నుంచి అభిప్రాయాలను స్వీకరించలేదన్న విషయం కూడా అర్థమవుతోందని పేర్కొంది.

# సైనిక విన్యాసాల్లో అపశృతి

## ఐదుగురు జవాన్లు మృతి

**విశ్వంభర, లడఖ్:** తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్ఏసీ) వద్ద సైనిక విన్యాసాలు చేస్తుండగా ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..లడఖ్‌లోని న్యోమా–చుషుల్ ప్రాంతంలో ఇండియన్ ఆర్మీకి చెందిన సైనికులు విన్యాసాలు చేపట్టారు. అనంతరం శనివారం తెల్లవారుజామున టీ–73 యుద్ధ ట్యాంకుతో ష్యోక్ నదిని దాటుతుండగా.. అకస్మాత్తుగా నది నీటి మట్టం పెరగడంతోత ట్యాంక్ నదిలో మునిగిపోయింది. చుషుల్ నుంచి 148 కిలోమీటర్ల దూరంలోని మందిర్ మోర్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఒక జూనియర్ కమిషన్డ్ అధికారితో సహా ఐదుగురు సైనికులు మృతిచెందారు. విషయం తెలుసుకున్న వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అయితే నదిలో బలమైన నీటి మట్టం కారణంగా, సైనికులను రక్షించలేకపోయారు. ఐదుగురు జవాన్ల మృతదేహాలను బయటకు తీశారు.

### కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ దిగ్భ్రాంతి

ఈ ప్రమాదంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పందించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ‘లడఖ్‌లో దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదంలో ఐదుగురు భారత సైనికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. సైనికుల ఆదర్శప్రాయమైన సేవలను ఎప్పటికీ మరచిపోలేం. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. ఈ దుఖ సమయంలో దేశం వారికి అండగా నిలుస్తుంది’ అని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.



# మాది ఉద్యోగస్తుల ఫ్లెండ్రీ సర్కార్

## పథకాలు ప్రజలకు చేరడంలో వారిదే కీలక పాత్ర
## మంత్రి బాల వీరాంజనేయ స్వామి



**విశ్వంభర, ప్రకాశం :** మాది ఉద్యోగస్తుల ఫ్లెండ్రీ సర్కార్ అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడంలో వారిదే కీలక పాత్ర అని రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలోని ఆరు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమం జులై 1వ తేదీన ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలి.. సాయంత్రం 5 గంటల కల్లా పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలన్నారు.. రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి ఉద్యోగస్తులు సహకరించాలని కోరారు.. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అప్పుడు, ఇప్పుడు ఉద్యోగస్తులతో ఫ్రెండ్లీ గానే ఉంటుందని.. దానికి తగినట్టు ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి అందజేయడంలో ఉద్యోగస్తులు కీలకంగా పని చేయాలని ఆయన సూచించారు



## రేషన్ మాఫియా అక్రమాలపై
# సీఐడీ విచారణ కోరతాం

- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- మంత్రి నాదెండ్ల మనోహర్

**విశ్వంభర, కాకినాడ :** రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖపై కాకినాడలో రెండో రోజు నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు రేషన్ సరకులు వెళ్తున్నాయని మండిపడ్డారు. రేషన్ మాఫియా అక్రమాలపై సీఐడీ విచారణ కోరతామని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ వార్నింగ్ ఇచ్చారు. టోల్‌గేట్‌ల వద్ద సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా విచారణ జరుపుతాం అని అన్నారు. తొలిరోజు తనిఖీల్లో కాకినాడలోని 6 గోదాముల్లో లోపాలు గుర్తించాం. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించాం. 7615 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నాం కాకినాడలో ఒక వ్యవస్థీకృత మాఫియా ఏర్పడింది.

ఇక్కడి రేషన్ మాఫియా సొంత నౌకనే ఏర్పాటు చేసుకునే స్థాయిలో ఉంది అని అన్నారు. కాకినాడ పోర్టు అంటేనే అందరూ భయపడుతున్నారు అని అన్నారు. నిన్నటి తనిఖీల్లో 6 సంస్థల పాత్రను గుర్తించాం. వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం అని నాదెండ్ల మనోహర్‌అన్నారు.



# ఏపీపై మోడీ సవతి ప్రేమ

- బాబుది హడావిడి తప్పు.. పని శూన్యం
- పోలవరం విధ్వంసానికి కారకులు బీజేపీ, టీడీపీ వైసీపీలే
- ఏపీపీసీసీ చీఫ్ షర్మిల ధ్వజం

**విశ్వంభర, అమరావతి:** కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్టు... పోలవరం విధ్వంసానికి అసలు కారకులు బీజేపీ, టీడీపీ, వైసీపీలే అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో షర్మిల తన బాణీ వినిపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మించి 28 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నది దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయం అయితే... పంతాలు, పట్టింపులకు పోయి జీవనాడి పోలవరంపై ఇన్నాళ్లు జరిగింది రాజకీయ దాడి తప్ప మరొకటి కాదని షర్మిల విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ హోదా ఇచ్చిందని, కానీ మోడీ సర్కారు సవతి తల్లి ప్రేమ చూపించిందని, జాతీయ హోదా బాధ్యతను విస్మరించి పదేళ్ల పాటు నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. కేంద్రం నిర్మించాల్సిన ప్రాజెక్టును తానే కడతానని చెప్పి, పోలవరం సోమవారం అంటూ హడావిడి చేయడం తప్ప బాబు మొదటి ఐదేళ్లలో చేసింది శూన్యం. రివర్స్ టెండరింగ్ పేరిట జగన్ అంచనా వ్యయం పెంచాడే తప్ప ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. రూ.10 వేల కోట్లతో కాంగ్రెస్ హయాంలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం ఖరీదు రూ.76 వేల కోట్లు, ప్రాజెక్టు కట్టాలంటే మరో ఐదేళ్లు పడుతుందని చెబుతున్న సీఎం చంద్రబాబు గారూ... ఇప్పుడు మోదీ పిలక మీ చేతుల్లోనే ఉంది, కేంద్రాన్ని శాసించే అధికారం మీ దగ్గరుంది... కాబట్టి, రాష్ట్రంపై ఆర్థిక భారం పడకుండా పూర్తిస్థాయిలో నిధులు తీసుకువచ్చి పోలవరం పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది" అంటూ షర్మిల పేర్కొన్నారు.

# ప్రజా భద్రత మా బాధ్యత

- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యం
- జూలై 1 నుంచి కొత్త లబ్ధిదారులకు కొత్త పింఛన్లు
- సంక్షేమం చూసే ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది
- పెన్షన్ దారులకు సీఎం చంద్రబాబు లేఖ



**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలోని పెన్షన్ దారులకు ఏపీ సీఎం చంద్రబాబు బహిరంగ లేఖ రాశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చటమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమన్నారు. అందరి మద్దతుతో అండగా నిలుస్తూ.. సంక్షేమం చూసే ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందని, ఏ ఆశలు, ఆకాంక్షలతో ప్రజలు ఓట్లేసి గెలిపించారో వాటిని నెరవేర్చడమే తక్షణ ప్రథమ కర్తవ్యమన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు పెన్షన్ను ఒకేసారి రూ. 1000 పెంచామని, ఇకపై రూ.4000 ఇస్తామని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.3000 పెంచామని, ఇకపై వారికి రూ.6000 ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. 28 వర్గాలకు చెందిన 65, 18, 496 మంది పెన్షన్ లబ్దిదారులకు జూలై 1వ తేదీ నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్దనే అందిస్తామని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నా.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే మంచి చేసే నిర్ణయాలు తీసుకున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పెన్షన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ. 819 కోట్ల భారం పడుతున్నా.. ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి తెచ్చామన్నారు. ఎన్నికల సమయంలో వికృత రాజకీయాల కోసం నాటి అధికార పక్షం పెన్షన్ విషయంలో వృద్ధులను ఎంతో క్షోభ పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మూడు నెలల పాటు పెన్షన్ అందుకోవడానికి పడిన కష్టాలు చూసి చలించిపోయానని, మండుటెండలో, వడగాడ్పుల మధ్య మీరు పడిన అగచాట్లు చూసి.. ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంపును వర్తింపచేస్తానని మాటిచ్చానని చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. అందులో భాగంగా ఏప్రిల్. మే. జూన్ నెలలకు కూడా ఈ పెంపును వర్తింప చేసి మీకు అందిస్తున్నాన్నారు. మూడు నెలలకు పెంచిన రూ.3000, జూలై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7000 మీ ఇంటికి తెచ్చి ఇస్తున్నామన్నారు. సంక్షేమ పాలకుడు, సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ పేరును తిరిగి ఈ పింఛన్ల కార్యక్రమానికి పెట్టామని ఆయన చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇకపై మీ ఇంటి వద్ద సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుందని, పెరిగిన పింఛనుతో మీకు ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నామని, ప్రజా భద్రత మా బాధ్యత.. ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఎప్పుడూ మంచి చేయాలని చూసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

# పెన్షన్‌దారులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

- రూ.4,400 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- సోమవారం ఉదయం 6 గంటలకు పిన్షన్లపంపిణీ ప్రారంభించాలి
- ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్



**విశ్వంభర, అమరావతి:** ఏపీ ప్రభుత్వం పెన్షన్ లబ్దిదారులకు మంచి శుభవార్త చెప్పింది. జులై 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి సిద్ధం అవుతోంది ప్రభుత్వం.. గత మూడు నెలల ముందే నుంచే పెంచిన పెన్షన్‌తో పాటు.. జులై నెల పెన్షన్ కూడా కలిపి ఒకేసారి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. దీని కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై కలెక్టర్లతో శనివారం వీడియో కార్ఫరెన్స్ నిర్వహించారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్.. పెన్షన్ల పంపిణీ నిమిత్తం రూ.4,400కోట్ల విడుదల చేసినట్టు వెల్లడించారు. జులై 1వ తేదీన 65.18 లక్షల మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి ఫించన్లు పంపిణీ చేపట్టాలని స్పష్టం చేశారు. ఫించన్ల పంపిణీకి ఇతర ఫంక్షనరీల సేవలను కూడా వినియోగించు కోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, పెన్షన్ల పంపిణీపై గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ జులై 1వ తేదీన 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన డబ్బులను రాత్రిలోగా విత్ డ్రా చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పెన్షన్‌ను పెంచనున్నట్టు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన విషయం విదితమే.. దాని అనుగుణంగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే ఆ ఫైల్‌పై సంతకం చేశారు.. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన మూడు వేల పించన్ నాలుగు వేలకు పెంచింది కూటమి సర్కారు.. ఏప్రిల్ నెల నుంచే పెంచిన మొత్తాన్ని ఇస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేయగా.. ఆ ప్రకారం జులై నెలకు ఇచ్చే నాలుగు వేల ఫించన్ తో పాటు గడచిన మూడు నెలలకు ఇవ్వాల్సిన మూడు వేల రూపాయలను కలిపి లబ్ధిదారులకు ఇవ్వనున్నారు.. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో సామాజిక ఫించన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే కావడం మరో విశేషం.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇస్తున్న పెన్షన్ కావడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీకి సిద్ధం అయ్యింది.. రేపు ఆదివారం కావడంతో.. ఈరోజు నిధులు విడుదల చేసింది.. అంతేకాదు.. ఆ సొమ్మును డ్రా చేసుకుని సిద్ధంగా పెట్టుకోవాలని.. జులై 1వ తేదీన అంటే.. సోమవారం ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రారంభం కావాలని స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.



## రేపు కాకినాడకు డిప్యూటీ సీఎం పవన్

- మూడు రోజుల పాటు పర్యటన
- గొల్లప్రోలులో పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరు
- జూలై 3న పిఠాపురంలో వారాహి కృతజ్ఞతా సభ

**విశ్వంభర, కాకినాడ:** కాకినాడ జిల్లాలో పర్యటించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రెడి అయ్యారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల అయింది. జులై 1వ తేదీ నుంచి 3 రోజుల పాటు పవన్ కళ్యాణ్ పర్యటన ఉండబోతుందని ప్రకటించారు. తొలి రోజు గొల్లప్రోలులో పెంచిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.. ఆ తర్వాత పిఠాపురం జనసేన నేతలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, జూలై 2వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే జులై 2వ తేదీన సాయంత్రం జనసేన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నారు. ఇక, జులై 3న ఉదయం ఉప్పాడ కొత్తపల్లి సముద్ర ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. సాయంత్రం పిఠాపురంలో వారాహి కృతజ్ఞతా సభలో ఆయన ప్రసంగించనున్నారు.

# నా పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నాడు

## డీజీపీకి హరిరామ జోగయ్య లేఖ



**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో జరిగిన ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు లేఖలు రాస్తూ వార్తల్లో నిలిచిన మాజీ మంత్రి హరిరామ జోగయ్య ఈసారి డీజీపీకి లేఖ రాశారు. తన పేరుతో డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మరోసారి తెరపైకి వచ్చారు. అత్యవసరంగా డబ్బులు కావాలంటూ తన పేరుతో ప్రముఖులకు అగంతకుడు ఫోన్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని డీజీపీ ద్వారకా తిరుమలరావుకు లేఖ రాశారు. గతంలోనూ సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసినా కాని ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పు రావడం లేదని వాపోయారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన రాజకీయ నాయకులకు ఫోన్ చేస్తు డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. అగంతకుడిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఏపీలో జనసేన కు మద్దతుదారుడిగా ఉన్న హరిరామ జోగయ్య అనేకసార్లు పవన్‌కల్యాణ్‌కు లేఖలు రాశారు. టీడీపీతో పొత్తుకు ముందు, తరువాత జరిగే పరిణామాలను వివరిస్తూ చంద్రబాబు రాజకీయ కుట్రలకు బలి కావొద్దని సూచనలు చేశారు. పొత్తు అసలు వద్దే వద్దంటూ ఒంటరిగా పోటీ చేయాలని, పొత్తు కుదుర్చుకుంటే సీఎం పదవికాలాన్ని సమభాగాలుగా పంచుకోవాలని లేఖలు రాశారు. అయితే పవన్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో నా సలహాలు పాటించకపోవడం మీ ఖర్మ అంటూ లేఖలు రాయడం నిలిపివేశారు.

# విశ్వ విజేత టీమిండియా



(మొదటి పేజీ తరువాయి)

పెద్ద దెబ్బ తగిలింది. అతను ఫైన్ లెగ్ వద్ద కగిసో రబడ క్యాచ్ ఔట్ అయ్యాడు. దీంతో పవర్ ప్లేలోనే టీమిండియా మూడు వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఆ తర్వాత అక్షర్, కోహ్లి అద్భుతంగా రాణించడంతో జట్టు మంచి స్కోర్ దిశగా సాగింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 54 బంతుల్లో 72 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఏడో ఓవర్ నుంచి 15వ ఓవర్ల మధ్య 72 పరుగులు వద్ద అక్షర్ పటేల్ ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన శివమ్ దూబే 17 బంతుల్లో 27 పరుగులు చేశాడు. చివరి ఐదు ఓవర్లలో కోహ్లి దూకుడుగా.. ఆడడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి టీమిండియా 176 రన్స్ కొట్టింది.

### క్లాసెన్ దూకుడు

అనంతరం లక్ష్యచేధనకు దిగిన సౌతాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 165 పరుగులు చేసి ఓటమిపాలైంది. క్లాసెన్ విధ్వంసం 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీసాడు. స్టబ్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. హెన్రీచ్ క్లాసెన్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 52) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. క్వింటన్ డికాక్ (31 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 39), ట్రిస్టన్ స్టబ్స్ కీలక ఇన్నింగ్స్ ఆడారు. డేవిడ్ మిల్లర్ (21) పరుగులు రాణించగా.. మిగతా ఆటగాళ్లలో రీజా హెండ్రిక్స్ (4), కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ (4), మార్కో జాన్సెన్ (2), రబడా (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కేశవ్ మహారాజ్ (2), అన్రిచ్ (1)తో అజేయంగా నిలిచారు. టీమిండియా టీమిండియా బౌలర్లలో హార్దిక్ పాండ్యా(3/20) మూడు వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా(2/18), అర్ష్‌దీప్ సింగ్(2/20) రెండేసి వికెట్లు పడగొట్టారు. అక్షర్ పటేల్ ఓ వికెట్ తీసాడు. బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (27 బంతుల్లోనే 52 పరుగులు) భీకర బ్యాటింగ్ చేసి టీమిండియాను టెన్షన్ పెట్టాడు. అద్భుత అర్ధ శకతం చేశాడు. అయితే మిగిలిన సఫారీ బ్యాటర్లు రాణించలేకపోయారు. టీమిండియా బౌలర్ల విజృంబణతో చివరి ఓవర్లలో సఫారీ బ్యాటర్లు వణికిపోయారు. మొత్తంగా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసి ఓడింది దక్షిణాఫ్రికా. ఓ దశలో 30 బంతుల్లో 30 పరుగులు చేయలేక ఓడింది. తొలిసారి ప్రపంచ కప్ ఫైనల్‌కు వచ్చిన దక్షిణాఫ్రికాకు నిరాశ ఎదురైంది.

### కోహ్లి మెరుపు ఇన్నింగ్స్

టీ20 ప్రపంచకప్ 2024 టోర్నీలో స్థాయికి తగ్గట్టు రాణించలేకపోయిన టీమిండి స్టార్ విరాట్ కోహ్లి.. ఫైనల్‌లో అదరగొట్టాడు. 59 బంతుల్లోనే 76 పరుగులతో అత్యంత ముఖ్యమైన హాఫ్ సెంచరీ చేశాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్నాడు. 6 ఫోర్లు, 2 సిక్సర్లు బాదాడు. టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. మొత్తంగా ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 176 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (31 బంతుల్లో 47), శివమ్ దూబే (16 బంతుల్లో 27 రన్స్) రాణించారు.

### నిప్పులు చెరిగిన బుమ్రా

177 పరుగుల లక్ష్యచేధనలో సౌతాఫ్రికాకు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. రీజా హెండ్రిక్స్‌ను బుమ్రా (4) స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే అర్ష్‌దీప్ సింగ్ కీపర్ క్యాచ్‌గా మార్క్‌రమ్(4)ను పెవిలియన్ చేర్చాడు. దాంతో 12 పరుగులకే సౌతాఫ్రికా 2 కీలక వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో క్వింటన్ డికాక్, ట్రిస్టన్ స్టబ్స్ జట్టును ఆదుకున్నారు. దూకుడుగా ఆడుతూ వేగంగా పరుగులు చేశారు. 18వ ఓవర్‌లో బుమ్రా స్టన్నింగ్ డెలివరీతో మార్కో జాన్సెన్(2)ను క్లీన్ బౌల్డ్ చేసి 2 పరుగులే ఇచ్చాడు. దాంతో చివరి 12 బంతుల్లో సఫారీ విజయానికి 19 పరుగులు అవసరమయ్యాయి. 19వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ సింగ్ 4 పరుగులే ఇవ్వడంతో ఆఖరి ఓవర్‌లో 15 రన్స్ చేయాల్సి వచ్చింది. తొలి బంతికి సూర్య సూపర్ క్యాచ్‌తో డేవిడ్ మిల్లర్ పెవిలియన్ చేరాడు. ఐదో బంతికి కగిసో రబడా కూడా ఔటవ్వడంతో టీమిండియా విజయం లాంఛనమైంది.

### మలుపు తిప్పిన క్యాచ్

టీమిండియా స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ కళ్లు చెదిరే క్యాచ్‌తో ఔరా అనిపించాడు. సౌతాఫ్రికా విజయానికి 6 బంతుల్లో 15 పరుగులు అవసరమవ్వగా.. తొలి బంతిని డేవిడ్ మిల్లర్ లాంగాఫ్ దిశగా భారీ షాట్ ఆడాడు. దాదాపు సిక్సర్‌గా దూసుకెళ్లిన ఈ బంతిని సూర్య బౌండరీ లైన్‌పై చాకచక్యంగా అందుకున్నాడు. ముందుగా సిక్సర్‌ను అడ్డుకొని బంతిని ఒడిసి పట్టుకు సూర్య.. సమన్వయం కోల్పోవడంతో గాల్లోకి విసిరేసాడు. మళ్లీ మైదానంలోకి వచ్చి బంతిని అందుకున్నాడు. ఈ క్యాచ్.. మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. ఒకవేళ సూరీడు ఈ క్యాచ్ వదిలేసి ఉంటే సిక్సర్‌గా వెళ్లేది.



### కోహ్లి సంచలన ప్రకటన

దేశం మొత్తం టీ20 వరల్డ్ కప్ గెలిచిన సంబరాల్లో ఉండగా.. విరాట్ కోహ్లి సంచలన ప్రకటన చేశారు. ఇదే నా చివరి టీ 20 ప్రపంచ కప్ అని.. టీ 20 మ్యాచ్ లకు రిటైర్ మెంట్ తీసుకుంటున్నట్లు వెల్లడించాడు. ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లి నిలిచాడు. ఫైనల్ అనంతరం కోహ్లి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యాడు. 'మేం అనుకున్నది సాధించాం. మా కల నెరవేరింది. టీమిండియాకు ఆడేందుకు నాకు గొప్ప అవకాశం వచ్చింది. ఆ ఛాన్స్ సద్వినియోగం చేసుకున్నాను. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇదే సరైన సమయమని భావించా. పరుగులు ఇక చేయడం సాధ్యం కావడం లేదనుకుంటే, ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. మాలో ఎంతో మంది ఈ కప్ నెగ్గాలని కలలు కన్నాం. నేటికి ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. యువ ఆటగాళ్లకు ఛాన్స్ రావాలి, వారికి టీమిండియాకు ప్రాతినిథ్యం వహించే అవకాశాలు వస్తాయి. భవిష్యత్తులో భారత్ మరిన్ని మెగా ట్రోఫీలు సాధిస్తుందని' కోహ్లి విశ్వాసం వ్యక్తం చేశారు.



## ప్రైజ్ మనీ వివరాలు

**(టీమిండియా) విజేత - రూ. 20.40 కోట్లు**

**సౌతాఫ్రికా (రన్నరప్) - రూ. 10.67 కోట్లు**

**ఓడిన సెమీఫైనలిస్టులు- రూ.6.48 కోట్లు**

**సూపర్ 8 జట్లు - రూ. 3.16 కోట్లు**

**9-12వ స్థానంలో ఉన్న జట్లు - రూ. 2 కోట్లు**

**13-20వ స్థానంలో ఉన్న జట్లు - రూ. 1.87 కోట్లు**

**ఒక్కో మ్యాచ్ గెలిచినందుకు బోనస్ - రూ. 26 లక్షలు**



## అంబానీ, అదానీలపై అదనపు పన్ను..

### ఓకే అన్న 74శాతం మంది పౌరులు..

**విశ్వంభర, బిజినెస్ :** ధనవంతుడు ఇంకా ధనవంతుడు అవుతున్నాడు.. పేదవాడు ఎప్పటికీ పేదవాడిగానే మిగిలపోతున్నాడు. పేద, ధనిక మధ్య అంతరం తగ్గడం లేదు సరికదా.. మరింత పెరిగిపోతోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్నా.. మన దేశంలో మరింత అధికంగా ఉంది. ఈ అసమానతలను తగ్గించేందుకు అత్యంత సంపన్నులపై సంపద పన్ను విధించాలని చాలా కాలంగా డిమాండ్ వినిపిస్తూనే ఉంది. మన దేశంలో అయితే మరింత గట్టిగా వినిపిస్తోందని ఓ సర్వే వెల్లడించింది. అత్యంత ధనిక వర్గంపై అదనపు పన్ను సూపర్ రిచ్ ట్యాక్స్ లేదా సంపద పన్నును విధించాలని చాలా మంది భారత పౌరులు కోరుతున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అసలు ఈ సంపద పన్ను అంటే ఏమిటి? దీని పరిధిలోకి వచ్చే వారు ఎవరు? వంటి వివరాలు ఇప్పుడు చూద్దాం..

### సర్వే ఇలా..

ఎర్త్4ఆల్, గ్లోబర్ కామన్స్ అలయన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెలుగు చూశాయి. దేశంలోని ఆదాయ అసమానతలు, ఆర్థిక అసమానతలను తగ్గించడానికి కోటీశ్వరులపై సంపద పన్ను విధించాలని 74శాతం భారతీయులు అభిప్రాయపడ్డారని ఆ సర్వే నివేదిక స్పష్టం చేసింది. అంటే మన దేశంలోని ప్రతి నలుగురిలో ముగ్గురు ఈ సంపద పన్ను అంశాన్ని సమర్థిస్తున్నట్లు లెక్క.

### జీ20 దేశాల సదస్సులో ప్రతిపాదన..

ఈ సంపద పన్ను అంశాన్ని ఈ ఏడాది బ్రెజిల్లో జరగనున్న జీ20 దేశాల సమావేశాల్లో ప్రతిపాదించనున్నారు. ఈ మేరకు ఆయా దేశాల్లో దీనికి 68శాతం మంది మద్దతు పలికారు. మన దేశంలో మాత్రం ఏకంగా 74శాతం మంది మద్దతునిచ్చారు. వచ్చే నెలలో బ్రెజిల్ దేశంలో జీ20 దేశాల ఆర్థిక మంత్రులు దీనిపై చర్చించనున్నారు. అనంతరం వారి నుంచి ఉమ్మడి ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జీ20 దేశాల్లో ఈ వెల్త్ ట్యాక్స్(సంపద పన్ను) విధింపుపై సర్వే చేశారు. దాదాపు 22వేల సామాన్య పౌరుల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. మన భారత దేశంలోనే కాదు ప్రపంచంలోని అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఆర్థిక అసమానతలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. దీంతో సంపద పన్ను ప్రతిపాదన 2013 నుంచే చర్చలో ఉంది. ఏటా దీనికి మద్దతు పెరుగుతూ వస్తోంది. కోవిడ్ తర్వాత దీనికి మరింత డిమాండ్ పెరిగింది.

### ఆ డబ్బును దేనికి వినియోగించాలి..

సంపన్నులపై సంపద పన్ను విధిస్తారు సరే.. మరి ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తారు? ఇదే ప్రశ్నను సర్వేలో సైతం అడిగారు. దీనికి మన భారతీయులు ఇచ్చిన సమాధానాలు ఆసక్తి కరంగా ఉన్నాయి. ఆ పన్నుతో వచ్చే ఆదాయాన్ని వాతావరణ మార్పులు, ప్రకృతి సంరక్షణకు ఉపయోగించాలని ఆకాంక్షించారు. అలాగే కార్బన్ ఉద్గారాలా నివారణకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు కేటాయించాలని 74శాతం మంది, మెరుగైన వర్క్ లైఫ్ బ్యాలెన్స్ కోసం కేటాయించాలని 76శాతం మంది, పవర్ జనరేషన్, ట్రాన్స్‌పోర్టు, నిర్మాణం, పరిశ్రమల వంటి రంగాల్లో మార్పుల కోసం కేటాయించాలని 68శాతం మంది అభిప్రాయపడ్డారు.

## అత్యంత విలువైన బ్రాండ్లలో టాటా గ్రూప్ అగ్రస్థానం

**వినియోగదారులు బ్రాండ్ పేరుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కొనే వస్తువు ఏదైనా బ్రాండెడేనా కాదా అనే విషయాన్ని తప్పనిసరిగా చూస్తారు. అయితే మన దేశంలో ఏది టాప్ బ్రాండ్ అంటే అది కొనే వస్తువును బట్టి మారుతుంటుంది. కాని దేశంలో అందుబాటులో ఉన్న వస్తువుల్లోని బ్రాండ్లతో పోల్చి.. అత్యంత విలువైన బ్రాండ్ ఏది అడిగితే చెప్పడం కష్టమే. అయితే దీనిపైనే బ్రాండ్ ఫైనాన్స్ అనే బ్రాండ్ వ్యాల్యూయేషన్, స్ట్రాటజీ కన్సల్టెన్సీ సంస్థ ఓ రిపోర్టును ప్రచురించింది. ఇండియా 100 2024 పేరిట ఆ నివేదికను వెల్లడించింది. తన లెక్కల ప్రకారం మన దేశంలో అత్యంత విలువైన బ్రాండ్ టాటా అని తేల్చింది. టాటా గ్రూప్ బ్రాండ్ వాల్యూ 28.6 బిలియన్ డాలర్లు గా పేర్కొంది. డిజిటలైజేషన్, ఈ-కామర్స్ ఈవీ, ఎలక్ట్రానిక్స్ పై దృష్టి సారిస్తూ దాదాపు 9శాతం తన విలువను పెంచు కున్నట్లు వివరించింది. ఈ నేపథ్యంలో ఈ బ్రాండ్ నివేదికలోని ప్రధాన అంశాలు ఏమిటి? తెలుసుకుందాం రండి..**




**విశ్వంభర, బిజినెస్ :** టాటా గ్రూప్ బ్రాండ్ విలువ 30 బిలియన్ డాలర్లు చేరింది. మొదటిసారిగా ఒక భారతీయ బ్రాండ్ ఈ మార్కును చేరుకుందని వివరించింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవకాశాలను ప్రతిబింబిస్తుందని చెప్పింది. గత మూడు సంవత్సరాలలో, టాటా గ్రూప్ దాని మానిఫోల్డ్ ఎంటర్‌ప్రైజెస్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అత్యాధునిక సాంకేతికతను తీసుకొచ్చింది. కఠినమైన సంస్థాగత శుద్ధీకరణను ఆర్కెస్ట్రేట్ చేసిందని బ్రాండ్ ఫైనాన్స్ పేర్కొంది. టాటా గ్రూప్ ఏకకాలంలో అనేక కొత్త వ్యూహాలను అమలు చేసిందని బ్రాండ్ ఫైనాన్స్ చెప్పుకొచ్చింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ స్పాన్సర్‌షిప్‌లు, ఏరోనాటికల్ రీబ్రాండింగ్ ప్రయత్నాలు, వెస్ట్‌సైడ్, టాటా కన్స్యూమర్ ఉత్పత్తుల అభివృద్ధి తదితర రిటైల్ డొమైన్‌ల ద్వారా విస్తృతమైన పెట్టుబడుల కారణంగా దాని బ్రాండ్ ప్రాముఖ్యత మెటియోరికల్‌గా పెరిగిందని వివరించింది.

### ఇన్ఫోసిస్ రెండో స్థానంలో..

బ్రాండ్ ఫైనాన్స్ లిస్టింగ్లో అత్యంత విలువైన బ్రాండ్లలో టాటా తర్వాత స్థానాన్ని ఇన్ఫోసిస్ సొంతం చేసుకుంది. 14.2 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో ఇన్ఫోసిస్ రెండో స్థానంలో నిలిచింది.

ఈ ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో హెచ్డీఎఫ్సీ గ్రూప్ ఉంది. దీని బ్రాండ్ విలువ 10.4 బిలియన్ డాలర్లుగా అంచనా. ఎల్ఐసీ, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, లార్సెన్ అండ్ టూబ్రో, మహీంద్రా వంటి వ్యాపార సమూహాలు ఆ తర్వాత అత్యంత విలువైన భారతీయ బ్రాండ్‌ల జాబితాలో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్ రెండు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకుంది. ఇది కూడా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, సేవలపై దృష్టి సారిస్తుంది. లార్సెన్, టూబ్రో బ్రాండ్ నిర్వహించే రంగాలలో సమర్థత, కార్యాచరణ శ్రేష్టతపై దాని పదునైన దృష్టి కారణంగా తొమ్మిదో స్థానాన్ని పొందింది.

### దూసుకెళ్తున్న భారత్..

అభివృద్ధి, స్వావలంబన, స్వయంప్రతిపత్తి విధానాల్లో కొత్త ట్రెండ్ సెట్ చేయడం ద్వారా భారతదేశం గ్లోబల్ సౌత్ లో విభిన్న నాయకుడిగా తనను తాను ప్రదర్శించుకుంటుందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అజిమోన్ ఫ్రాన్సిస్ అన్నారు. భారతదేశం నేడు ప్రపంచ భౌగోళిక రాజకీయాలలో ఒక కీలకమైన శక్తిగా ఉందన్నారు. బ్రాండ్ భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ సేవలకు ఫ్లాగ్ బేరర్‌గా ఉండటానికి భారతదేశం ప్రయత్నిస్తోందని ఫ్రాన్సిస్ చెప్పారు. గత సంవత్సరం నుంచి భారతదేశం తయారీ, ఇంజినీరింగ్ సేవలు, ఆర్ అండ్ డీ లలో నాలెడ్జ్ హబ్ కొనసాగుతోంది. టెలికాం రంగం బ్రాండ్ విలువలో 61 శాతం వృద్ధిని సాధించిందని. ఆ తర్వాత బ్యాంకింగ్ (26 శాతం), మైనింగ్, ఇనుము, ఉక్కు రంగాలు (ఒక్కొక్కటి కూడా దాదాపు 16 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటుంది) అని రంగాల విశ్లేషణ వివరించింది.

## వొడాఫోన్ కూడా పెంచేసింది..

**విశ్వంభర, బిజినెస్ :** దేశంలోని టెలికం కంపెనీలు వరుసగా టారిఫ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకుంటున్నాయి. ఇప్పటికే ప్రధాన టెలకం సంస్థలైన జియో, ఎయిర్‌టెల్‌లో రీఛార్జ్ ప్లాన్స్‌ను సవరిస్తూ ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. ఈ సంస్థలు ఏకంగా 12.5 శాతం నుంచి అత్యధికంగా 25 శాతం వరకు రీఛార్జ్ రేట్లు పెంచేశాయి. పెరిగిన ధరలు జూల్ 4వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయని కంపెనీలు ప్రకటించాయి. అయితే తాజాగా ఈ జాబితాలోకి వొడాఫోన్-ఐడియా కూడా వచ్చి చేరింది. దేశంలో మూడో అతిపెద్ద టెలికం సంస్థ అయిన వొడాఫోన్-ఐడియా మొబైల్ టారిఫ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ మొబైల్ టారిఫ్‌లను 10 నుంచి 21 శాతం వరకు పెంచాలని సర్వీస్ ప్రొవైడర్ నిర్ణయించింది. పెరిగిన ఈ ఛార్జీలు జూలై 4వ తేదీ నుంచి




అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం రూ. 179గా ఉన్న ప్లాన్ ఇప్పుడు రూ. 199గా మారనుంది. అలాగే రూ. 459 ప్లాన్ రూ. 509గా మారనున్నాయి. ఇక 365 రోజుల వ్యాలిడిటీతో వచ్చే రూ. 1799 ప్లాన్‌ను రూ. 1999కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పోస్ట్ పెయిడ్ ప్లాన్స్ విషయానికొస్తే ఇందులో రూ. 401 ప్లాన్‌ను రూ. 451కి పెంచారు. రూ. 501 ప్లాన్‌కు రూ.551 చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఫ్యామిలీ ప్లాన్‌తో వొడాఫోన్ అందిస్తున్న రూ. 601 ప్లాన్ ఇకపై రూ. 701గా మారనుంది. అలాగే రూ. 1001 ప్లాన్ కోసం ఇకపై రూ. 1201 చెల్లించాలి. ఇదిలా ఉంటే ప్రీపెయిడ్ యూజర్లకు రాత్రిపూట ఉచిత డేటాను అందించే ఏకైక ఆపరేటర్ వోడాఫోన్ ఐడియా అని కంపెనీ తెలిపింది. 4జీలో భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నామని, 5జీ మొబైల్ సేవలను ప్రారంభించబోతున్నా మని కపెంనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే టెలికం కంపెనీల టారిఫ్ పెంపుతో యూజర్లపై భారీగా భారం పడునుంది. దేశంలోని మొబైల్ యూజర్లపై ఏటా ఏకంగా రూ. 47,500 కోట్ల అదనపు భారం పడనుందని నివేదికలు చెబుతున్నారు. దేశంలో 5జీ సేవలను తీసుకొచ్చేందుకు గాను కంపెనీలు ఇటీవల భారీగా పెట్టుబడులు పెట్టాయి. ఈ నేపథ్యంలో టారిఫ్ రేట్లను సవరించినట్లు సమాచారం.


విశ్వంభర
V3 NEWS

## రచ్చ రంబోలే.. బిగ్‌బాస్ హౌస్‌లోకి హాట్ బ్యూటీ..



బిగ్ బాస్ సీజన్ 8 కోసం ప్రేక్షకులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. బిగ్ బాస్ సీజన్ 7 కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. మంచి టీఆర్పీ తో ఈ సీజన్ దూసుకుపోయింది. ఇప్పటివరకు ఏడూ సీజన్స్, ఓ ఓటీటీ సీజన్ ను పూర్తి చేసుకుంది ఇక ఇప్పుడు బిగ్ బాస్ సీజన్ 8 గురించి ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ఈ గేమ్ షో మొదలు కానుంది. ఈ సారి హౌస్‌లోకి ఎవరు పాల్గొంటారు అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఇప్పటికే కొంతమంది పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పేర్లు ఇవే.. జబర్దస్త్ కమెడియన్ కిర్రాక్ ఆర్పీ, అమృతా ప్రణయ్, అలాగే కుమారీ ఆంటీ, బర్రెలక్క, అనీల్ గీలా, పేర్లు కూడా ఈ లిస్టులో ఉన్నాయి. వీరితో పాటు బుల్లెట్ భాస్కర్, జబర్దస్త్ కమెడియన్, యాక్టర్ సోనియా సింగ్, యూట్యూబర్, బమ్ చిక్ బబ్లూ, హీరోయిన్ కుషితా కల్లపు, సురేఖ వాణి కూతురు సుప్రిత.వీరితో పాటు ఓ హాట్ బ్యూటీ గురించి కూడా సోషల్ మీడియాలో వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఆ అమ్మడే రీతూ చౌదరి. సీరియల్స్ లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు. ఆ తర్వాత పలు టీవీ షోల్లో పాల్గొంది ఈ అమ్మడు. ఇక సోషల్ మీడియాలో రీతూ చౌదరి చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ అమ్మడు తన అందాలతో ఆకట్టుకుంటుంది రీతూ చౌదరి. ఈ బ్యూటీ అందానికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. తన అందాలతో రచ్చ చేస్తున్న ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్తుందని టాక్ వినిపిస్తుంది. ఇక ఈ అమ్మడు బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెడితే రచ్చ రచ్చ చేయడం ఖాయం అంటున్నారు ఫ్యాన్స్. చూడాలి మరి ఈ అమ్మడు బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెడుతుందో లేదో చూడాలి.

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న యాంకర్ రష్మీ



యాంకర్ రష్మీ ఇప్పుడు టాలీవుడ్ లో స్టార్ స్టేటస్ తో దూసుకుపోతోంది. ఈటీవీలో ఇప్పుడు ఆమెనే నెంబర్ వన్ స్థాయిలో ఉంది. ప్రస్తుతం వరుస ప్రోగ్రామ్స్ తో ఫుల్ బిజీగా గడిపేస్తున్న యాంకర్ రష్మీ.. అటు సినిమాల్లో కూడా బాగానే రాణిస్తోంది. హీరోయిన్ గా ఎదగాలని ఆమె ఎన్నో కలలు కన్నది. కానీ అది సాధ్యం కాలేదు. దాంతో యాంకర్ గా చేస్తూనే అడపా దడపా సినిమాల్లో నడిస్తోంది. ఈ క్రమంలోనే ఆమె తన ఫ్యాన్స్ తో సోషల్ మీడియాలో చిట్ చాట్ చేస్తూ ఓ ఆసక్తికర విషయాన్ని తెలిపింది. తనకు అరుదైన వ్యాధి ఉన్నట్టు తెలిపింది ఈ ముద్దుగుమ్మ. తనకు రుమటాయిడ్ అనే వ్యాధి ఉన్నట్టు తెలిపింది. అంటే ఈ వ్యాధి వల్ల బాడీలో ఇమ్యూనిటీ చాలా తక్కువగా ఉంటుందంట. దాని వల్ల త్వరగా జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుందని చెప్పింది. ఏదైనా అనారోగ్యం వచ్చినా సరే త్వరగా కోలుకోలేరని తెలిపింది. దాన్ని తగ్గించుకోవడానికి చాలానే డబ్బులు ఖర్చు పెట్టానని.. కానీ అస్సలు తగ్గట్లేదని తెలిపింది ఈ ముద్దుగుమ్మ.



## కుర్రకారు మనసు దోచేసి అందాల వయ్యారి

8 మే 1995న తమిళనాడులోని ఈరోడ్ లో జన్మించింది అందాల తార ఐశ్వర్య మీనన్. ఈమె కుటుంబం కేరళలోని చేందమంగళని చెందినది. తమిళనాడులోని ఈరోడ్‌లో వెల్లలార్ మెట్రిక్యులేషన్ స్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించింది ఈ ముద్దుగుమ్మ. SRM ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ పట్టా పొందింది ఈ బ్యూటీ. బాలాజీ మోహన్ దర్శకత్వంలో కధలిల్ సొదప్పువదు యెప్పడి అనే తమిళ చిత్రంతో చలనచిత్ర అరంగేట్రం చేసింది ఈ వయ్యారి. తర్వాత తమిళ రొమాంటిక్ డ్రామా చిత్రం యాపిల్ పెన్నేలో తొలిసారిగా కోమలవల్లి అనే పేరుతో కథానాయకిగా నటించింది. 2013లో M.S రమేష్ దర్శకత్వంలో దావసల అనే చిత్రంలో కథానాయకిగా కన్నడ ప్రేక్షకులకు పరిచయం అయింది ఈ వయ్యారి భామ. ఐశ్వర్య మీనన్ మాన్‌సూన్ మ్యాంగోస్ అనే సినిమాలో సపోర్టింగ్ రోల్ లో మలయాళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది. 2023లో యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం స్పైలో నిఖిల్ సరసన హీరోయిన్ గా తొలిసారి టాలీవుడ్ మూవీలో నటించింది ఈ భామ. ప్రస్తుతం తెలుగు యంగ్ హీరో కార్తియకకి జోడిగా భజే వాయు వేగం అనే చిత్రంలో నటిస్తుంది. తెలుగులో ఈ వయ్యారి మరిన్ని సినిమాల్లో నటించే అవకాశం వస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ అవడం ఖాయం.



## కల్కి సెకండ్ పార్ట్ పై బిగ్ అప్ డేట్ ఇచ్చిన అశ్వినీ దత్

కల్కి మూవీ గురించి ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే పురాణాల కథలను బేస్ చేసుకుని దాన్ని భవిష్యత్ కాలానికి అనుసంధానించి తీసిన తీయడంతో ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. దెబ్బకు నాగ్ అశ్విన్ పేరు దేశ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. ఇక కల్కి సినిమాలకు సెకండ్ పార్ట్ కూడా ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు. దాంతో అసలు సెకండ్ పార్ట్ లో ఏముంటుందా అని అందరూ ఎదురు చూస్తున్నారు. అసలు సెకండ్ పార్ట్ ఎప్పుడు వస్తుందా అని కూడా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మూవీ ప్రొడ్యూసర్ అయిన అశ్వినీ దత్ మీడియాతో చిట్ చాట్ చేశారు. సెకండ్ పార్ట్ కు సంబంధించిన షూటింగ్ 60 శాతం పూర్తి అయినట్టు తెలిపారు. మేజర్ పార్ట్స్ కొన్ని షూటింగ్ చేయాల్సి ఉందని.. దాన్ని కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని తెలిపారు నాగ్ అశ్విన్. సెకండ్ పార్ట్ లో ఇంతకు మించిన ఎంటర్ టైన్ మెంట్ ఉంటుందని ఆయన వివరించారు. దాంతో సెకండ్ పార్ట్ మీద అప్పుడే అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.



## అవును నేను తప్పు చేశాను..

స్టార్ హీరోయిన్ సమంత ఎప్పుడెప్పుడు సినిమాలు చేస్తుందా అని ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. మాయోసైటిస్ తో బాధపడుతున్న సామ్ దాన్ని నుంచి కోలుకోవడానికి ఏడాది పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. తెలుగులో చివరిగా ఖుషి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సామ్ సోషల్ మీడియాలో అభిమానులతో రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది. అప్పడప్పడూ కొటేషన్స్ పెడుతూ.. అప్పడప్పడు హాట్ హాట్ ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది. అలాగే అభిమానులతోనూ ముచ్చటిస్తుంది సామ్. ఈ క్రమంలోనే తాజాగా అభిమానులతో చిట్ చాట్ చేసింది. ఈ క్రమంలోని ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమంత ఆసక్తికర కామెంట్స్ చేసింది. నెటిజన్ అడిగిన ప్రశ్నకు అవును నేను తప్ప చేశాను అని ఒప్పకుంది సామ్. అనేక మంచి విషయాలు మీరు బాగానే చెబుతారు. కానీ, మీరే ఆరోగ్యానికి హానికరమైన బ్రాండ్‌స్‌ని కూడా ప్రమోట్ చేశారు అని సామ్ ను అడిగాడు. దానికి సామ్ స్పందిస్తూ.. అవును గతంలో నేను తప్పలు చేశాను అని ఒప్పకుంది. కానీ అవి కావాలని చేసిన తప్పలు కావు. వాటి గురించి తెలిసిన తర్వాత ఆ బ్రాండ్స్ ను ప్రమోట్ చేయడం ఆపేశాను అని తెలిపింది. ప్రస్తుతం తాను ఏదైతే చేస్తున్నానో వాటిని మాత్రమే ప్రమోట్ చేస్తున్నట్టు తెలిపింది సామ్. ఇప్పడు ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్టార్ హీరోయిన్ అయ్యుండి తప్పను సమర్ధించుకోకుండా నిజాయితీగా ఒప్పకుంది అంటూ సామ్ పై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక సమంత సినిమాల విషయానికొస్తే ఇటీవలే బంగారం అనే సినిమాను అనౌన్స్ చేసింది. అలాగే హిందీలో ఓ వెబ్ సిరీస్ లో నటిస్తుందని తెలుస్తోంది.

## వీర్యం వృద్ధి చెందాలంటే ఏం తినాలి?



**విశ్వంభర, ఫీచర్ :** మన శరీరంలో ఆరోగ్యంగా వుండాలంటే సూక్ష్మ పోషకాలు చాలా వుండాలి. అలాంటి వాటిల్లో వైటమిన్లు, మినరల్స్ వుంటాయన్న విషయం మీకు తెలిసిందే. మినరల్‌స్‌లో సిలీనియం చాలా అవసరం పడుతుంది. ఈ సిలీనియం పవర్ఫుల్ యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేస్తుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్లు శరీరం జబ్బు బారిన పడకుండా కాపాడుతూ వుంటుంది. శరీరానికి సిలీనియం చాలా అవసరం పడుతుంది. ప్రతీ రోజూ శరీరానికి 55 మైక్రో గ్రాముల సిలీనియం కావాలి. థైరాయిడ్ హార్మోన్లు ఉత్పత్తి కావడానికి సిలీనియం అవసరం పడుతుంది. అడవారిలో అండం విడుదల కావాలన్నా సిలీనియం కావాలి. వీర్య కణాలు ఉత్పత్తి కావడానికి కూడా సిలీనియం కావాల్సిందే. సిలీనియం లోపించిన వారికి పిల్లలు పుట్టే అవకాశాలు చాలా తక్కువగా వుంటాయ్. హైపోథైరాయిడ్ వచ్చిన వారిలో కూడా ఈ లోపం వుంటుంది. డీఎన్ఏ తయారు కావడానికి కూడా సిలీనియం చాలా అవసరం పడుతుంది.


**సిలీనియం పని అంతా ఇంతా కాదు..**

రోగనిరోధక శక్తిని యాక్టివేట్ చేయడానికి కూడా సిలీనియం బాగా ఉపయోగపడుతుంది. రక్త ప్రసరణ జరిగేటప్పుడు కొవ్వు నిలవకుండా వుండడానికి కూడా సిలీనియం కావాలి. ఆహారపదార్థాలను ఎక్కువగా వేడిచేయడం వల్ల సిలీనియం శాతం తగ్గిపోతుంది, క్యాన్సర్, హెచ్ఐవీ వచ్చిన వాళ్లల్లో కూడా సిలీనియం తగ్గిపోతుంది. గ్యాస్ట్రిక్ ట్రబుల్, మలబద్ధకం వున్నప్పుడు కూడా సిలీనియం లోపిస్తుంది. సిలీనియం లోపించినప్పుడు కొంచెం మత్తుమత్తుగా వుంటుంది. ఇలాంటి లక్షణం వుంటే అటు మగ, ఇటు ఆడవారిలో సంతానలేమి లోపం వుందని అర్థం చేసుకొచ్చు. అల్జీమర్ లాంటి సమస్యలు తలెత్తడం కూడా సిలీనియం లోపానికి కారణమవుతుంది. సిలీనియం లోపిస్తే జుట్టు కూడా ఊడిపోతుందని చెబుతున్నారు. బ్రెజిల్ నట్‌లో సిలీనియం అత్యధికంగా వుంటుంది. 100 గ్రాములో బ్రెజిల్ నట్‌స్‌లో 1917 మైక్రో గ్రాముల సిలీనియం వుంటుంది. 100 గ్రాముల బ్రౌన్ రైస్‌లో 19 గ్రాముల సిలీనియం వుంటుంది. పెరుగులో 8 గ్రాముల సిలీనియం వుంటుంది. పొద్దతిరుగుడు పప్పులో 80 మైక్రో గ్రాముల సిలీనియం వుంటుంది. అయితే బ్రెజిల్ నట్‌స్‌లోనే సిలీనియం అత్యధిక మోతాదులో వుంటుంది. ఈ సిలీనియం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది, జబ్బుల బారిన పడకుండా చేస్తుంది, డీఎన్ఏ ను ఆరోగ్యంగా వుంచడానికి కూడా ఈ బ్రెజిల్ నట్స్ బాగా ఉపయోగపడతాయ్.

**మగవారిలో పుష్కలంగా లైంగిక సామర్థ్యం**

గర్భిణులకు కూడా ఈ సెలీనియం చాలా అవసరం. కడుపులో బిడ్డ డీఎన్ఏ బాగా వృద్ధిలోకి రావాలన్నా కూడా ఈ బ్రెజిల్ నట్స్ కావాల్సిందే. వేయించి తినడం తగ్గిస్తే సిలీనియంను కావాల్సినంత పొందవచ్చు. న్యాచురల్ నట్‌స్‌ను రోజూ తీసుకుంటే సిలీనియం బాగా అందుతుంది. సిలీనియం సంమృద్ధిగా వుండే బ్రెజిల్ నట్స్ ఒక కేజీ 3వేల రూాపాయల వరకు వుంటుంది. రోజుకు 2,3 బ్రెజిల్ నట్స్ తింటే సరిపోతుంది. మెంతుల పొడి వల్ల కూడా వీర్యం పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం రెండు పూటలూ 5 గ్రాముల మెంతుల పొడిని తీసుకోవాలి. ఇది శరీరం లోపలికి వెళ్లి ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను బాగా తగ్గిస్తుంది. టైప్ 2 షుగర్ రాకుండా కూడా చేస్తుంది. రక్తంలో వున్న టెస్టోస్టిరోన్‌ను కూడా బాగా పెంచుతుంది. టెస్టోస్టిరోన్ లెవెల్స్ బాగుంటే స్పర్మ్ ప్రొడక్షన్ కూడా బాగుంటుంది. మగవారిలో లైంగిక సామర్థ్యం కూడా ఆటోమెటిక్‌గా పెరుగుతుంది.

## పీరియడ్స్ సమయంలో శృంగారం..



**విశ్వంభర, ఫీచర్ :** పీరియడ్స్ సమయంలో శృంగారం చేయవచ్చా? లేదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ సమయంలో శృంగారం చేయడం సురక్షితమేనా? ఇన్ఫెక్షన్లు తలెత్తే ప్రమాదాలు ఏమైనా ఉంటాయా? అని ప్రశ్నిస్తుంటారు. కొంతమంది పీరియడ్స్ సమయంలో సెక్స్‌లో పాల్గొంటే ప్రెగ్నెన్సీ రాదనే భావన చాలామందిలో నెలకొంది. అయితే 3 30% మంది మహిళలు పీరియడ్స్ సమయంలోనూ శృంగారం చేస్తారు. దీనిపై వైద్య నిపుణలు ఏమంటున్నారో తెలుసుకుందాం.

**ఎంజాయ్ చేయొచ్చు.. నో ప్రాబ్లమ్..**

కొంతమంది మహిళలకు పీరియడ్‌స్‌కి రెండు వారాల ముందు, ఓవులేషన్ సమయంలో శృంగార కోరికలు ఎక్కువగా పుడతాయి. పీరియడ్స్ సమయంలో, వల్వా, యోని ఉబ్బుతాయి. దీని ఫలితంగా భావప్రాప్తిని మరింత సంతృప్తికరంగా అనిపిస్తుంది. సెక్స్ సమయంలో సున్నితత్వం పెరిగి, ఎక్కువ సుఖం పొందుతారు. పీరియడ్స్ సమయంలో శృంగారంలో పాల్గొంటే ఎలాంటి హానీ గానీ ప్రమాదం గానీ వుండదు. అయితే పీరియడ్స్ సమయంలో శృంగారంలో పాల్గొనాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే అని నిపుణులు చెబుతున్నారు. పీరియడ్స్ సమయంలో శృంగారంలో పాల్గొనడం సురక్షితమే. అయితే కొన్ని జాగ్రత్తలు పాటించడం చాలా ముఖ్యం. జాగ్రత్తలు పాటించకపోతే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొన్ని ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం కూడా వుంది. కాబట్టి సూచనలను తప్పకుండా పాటించాల్సిందే.

**ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..**

మీరు రుతుస్రావం అవుతున్నారని మరియు శృంగారంలో పాల్గొనాలనుకుంటున్నారని మీ భాగస్వామికి తెలియజేయండి. మీరు ఇద్దరూ సురక్షితంగా మరియు సౌకర్యవంతంగా ఉండేలా ఏదైనా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందా అని చర్చించండి. శృంగారానికి ముందు మరియు తరువాత శుభ్రపరచుకోవడం చాలా ముఖ్యం. ఇది ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రుతుస్రావం సమయంలో మీ శరీరం సాధారణంగా ఎక్కువ రక్తస్రావం అవుతుంది. మీ భాగస్వామికి తెలియజేయండి మరియు అదనపు ప్యాడ్‌లు లేదా ట్యాంపాన్‌లను ఉపయోగించాల్సి ఉంటుంది. రక్తస్రావం అయ్యే అవకాశం తక్కువగా ఉండే స్థానాలను ఎంచుకోండి. ఉదాహరణకు, పై స్థానంలో (మీరు పైన ఉండేలా) శృంగారం చేయడం వల్ల రక్తస్రావం తక్కువగా కనిపిస్తుంది. లోతైన చొచ్చుకుపోవడం వల్ల రక్తస్రావం మరియు అసౌకర్యం పెరుగుతుంది. రుతుస్రావం సమయంలో శృంగారం చేసినప్పుడు కూడా గర్భం రాకుండా ఉండటానికి నిరోధకాలను ఉపయోగించడం చాలా ముఖ్యం.

**ఇలా ఉంటే అస్సలు నిరాకరించండి**

రుతుస్రావం నొప్పి లేదా అసౌకర్యం కారణంగా మీకు శృంగారంలో ఆసక్తి లేకపోతే వెంటనే మీ భాగస్వామికి తెలియజేయండి. మీకు యోని ఇన్ఫెక్షన్ లేదా మూత్ర మార్గ ఇన్ఫెక్షన్ ఉంటే, శృంగారం వల్ల ఇన్ఫెక్షన్ మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి అటువంటి సమయంలో శృంగారాన్ని నిరాకరించండి.రుతుస్రావం సమయంలో శుక్రకణాలు ఎక్కువ సేపు జీవించగలవు, కాబట్టి ఈ సమయంలో లెక్కింపు పద్ధతి గర్భం రాకుండా నిరోధించలేదు. ఇటువంటి సమయంలో తగు జాగ్రత్తలతోనే శృంగారంలో పాల్గొనాలి. రుతుస్రావంలో వున్నప్పుడు సెక్స్‌లో పాల్గొంటే కొన్ని లాభాలు కూడా వున్నాయ్. ఆ సమయంలో మహిళలకు లైంగిక కోరికలు చాలా ఎక్కువగా వుంటాయ్. రుతుస్రావం సమయంలో శరీరంలో హార్మోన్ల మార్పు విపరీతంగా మారుతూ వుంటుంది. పీరియడ్ సమయంలో వచ్చే నొప్పిని కూడా తగ్గిస్తుంది. ఈ సమయంలో ఎండార్ఫిన్లు కూడా రిలీజ్ అవుతాయ్. ఈ ఎండార్ఫిన్లు శరీరంలో పెయిన్ కిల్లర్లుగా కూడా పనిచేస్తాయ్.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com